# తీన్మార్

teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 257 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 22 జనవరి 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.


## రాష్ట్రపతి భవన్‌లోని అమృత్ ఉద్యానవనం

వచ్చే నెల 2 నుంచి సందర్శనార్థం అవకాశం




## CFL కేంద్రాల్లో కో ఆర్డినేటర్స్ అక్రమార్జన..?

నిండు గర్భిణీ కౌన్సిలర్ కు విధులు, జీతాల చెల్లింపులు నిజామా..?

గతంలో ఓ గర్భిణీ కౌన్సిలర్ విషయంలో చేసిందేంటి..?

ఓ కౌన్సిలర్ నుండి డబ్బులు కొట్టించుకున్న ఓ కో ఆర్డినేటర్

అక్రమాలు, ఆరోపణలపై సంస్థ చర్యలు తెలియాల్సి ఉంది




తీన్మార్ తెలుగు దినపత్రిక వరుస సంచికలలో వెలువడుతున్న "ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల" నిర్వహణ లోటుపాట్లలో కొన్నింటికి సంబంధించిన ఆరోపణలను బలపరిచే విధమైన ఆధారాలతో ప్రచురించడం జరిగింది. కాగా మరిన్ని అక్రమాల ఆరోపణలు వస్తూండడంతో తీన్మార్ దినపత్రిక నిఘా టీం ప్రత్యేక విచారణలో ఆర్థికపరమైన అక్రమ మరియు అనవసర లావాదేవీల సమాచారం కొన్ని ఆధారపూర్వకంగాను మరికొన్ని ఆరోపణలుగాను బహిర్గతం కావడం జరిగింది.




.. వివరాలు 2లో



# అర్హుల ఆందోళనలతో మరో ఛాన్స్

ప్రారంభమైన ప్రజాపాలన గ్రామసభ కార్యక్రమం




పథకాలు అమలుకు "రేవంత్ సర్కార్" వేగంగా అడుగులు

గ్రామసభల్లోనే లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ

ముమ్మరంగా కలెక్టర్లు, ఉన్నతాధికారుల పర్యటనలు

లోటుపాట్లపై వెంటనే పరిష్కారానికి చర్యలు

ఈ నెల 21 నుంచి 24 వరకు జరగనున్న కార్యక్రమం

తెలంగాణ బ్యూరో, జనవరి 21 (తీన్మార్ న్యూస్): సూపర్ సిక్స్ (ఆరు గ్యారెంటీ) పథకాలు వేగంగా అమలు చేసేందుకు ఒక్కో అడుగు ముందుకేస్తోంది రేవంత్ సర్కార్. మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు వివిధ పథకాలకు అప్లికేషన్లు స్వీకరిస్తోంది. నాలుగు స్కీములకు సంబంధించి ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ పథకాలు ఉన్నాయి. రేవంత్ సర్కార్ నాలుగు స్కీమ్‌లకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. జనవరి 21 నుంచి 24 వరకు ఈ కార్యక్రమం జరగనుంది. ఇందుకోసం గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహిస్తోంది. కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఆయా గ్రామాల్లో

మిగతా 2 లో

## ఫేక్ వెబ్‌సైట్స్ గుర్తించండి

లక్షల్లో మోసపోతున్న అమాయక ప్రజలు

టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ "ప్రజలకు" సూచనలు



హైదరాబాద్, జనవరి 21 (తీన్మార్ న్యూస్): ఫేక్ వెబ్‌సైట్స్ నమ్మి అమాయక ప్రజలు లక్షల్లో మోసపోతున్నారని, వాటిని ఈ విధంగా గుర్తించండి అని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ వివరించారు. ప్రస్తుత సమాజంలో టెక్నాలజీ పెరగడంతో పాటు సైబర్ నేరాలు కూడా పెరిగాయి. సైబర్ నేరగాళ్లు పలు టెక్నాలజీని ఉపయోగించుకొని నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి అమాయక ప్రజలను దోచేస్తున్నారు. అయితే ఈ నకిలీ వెబ్‌సైట్లను గుర్తించడంలో అవగాహన కల్పించేందుకు సజ్జనార్ ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా

మిగతా 2 లో



## ప్రభుత్వానికి టీ - సర్పంచుల సంఘం జేఏసీ బహిరంగ లేఖ

బిల్లులు చెల్లింపు తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్

తెలంగాణ బ్యూరో, జనవరి 21 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వానికి తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ బహిరంగ లేఖ రాసింది. సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్

మిగతా 2 లో

## తెలంగాణలో రానుంది బీజేపీ ప్రభుత్వమే

కాంగ్రెస్ పని అయిపోయిందంటూ ఈటల సంచలన వాఖ్యలు



హైదరాబాద్, జనవరి 21 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో రానుంది బీజేపీ ప్రభుత్వమేనని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పని అయిపోయిందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమలుకు

మిగతా 2 లో



02

## సమస్యలకు కేరాఫ్‌గా హైదరాబాద్

మాజీ మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

పేదల పక్షాన పోరాడుతాం అంటూ ప్రకటన

## 75 సం. రాజ్యాంగ ప్రదర్శనకు గణతంత్ర దినోత్సవ పరేడ్

పాల్గొననున్న 160 మంది ఇండోనేషియా కవాతు బృందం



02



## 85వ ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్‌లో తెలంగాణ బృందాలు

కాన్ఫరెన్స్ లో ప్రసంగించిన తెలంగాణ శాసనసభ స్పీకర్

న్యూ ఢిల్లీ, జనవరి 21 (తీన్మార్ న్యూస్): బిహార్ లోని పాట్నా నగరంలో జరుగుతున్న 85వ ఆలిండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ లో తెలంగాణ శాసనసభ, శాసనమండలి బృందాలు పాల్గొన్నాయి. ఈ కాన్ఫరెన్స్ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

మిగతా 2 లో

## జలసౌధలో కృష్ణా నది యాజమాన్య బోర్డ్ సమావేశం

రెండు రాష్ట్రాల నుండి ఇరిగేషన్ సెక్రటరీలు, ఈఎన్సీలు హాజరు

నిర్మిస్తున్న ప్రాజెక్టులపై ఈ సమావేశంలో చర్చ



02

## హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్




02

ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభం కానున్న హైడ్రా పీఎస్

ఈ మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడి



02

## నిరుద్యోగ యువతకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శుభవార్త

5 లక్షల ఉద్యోగాలు కల్పించబోతున్నట్లు ప్రకటన

# CFL కేంద్రాల్లో కో ఆర్డినేటర్స్ అక్రమార్జన..?

తెలంగాణ బ్యూరో, జనవరి 21 (తీన్మార్ న్యూస్): తీన్మార్ తెలుగు దినపత్రిక వరుస సంచికలలో వెలువడుతున్న "ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలు" నిర్వహణ లోటుపాట్లలో కొన్నింటికి సంబంధించిన ఆరోపణలను బలపరిచే విధమైన ఆధారాలతో ప్రచురించడం జరిగింది. కాగా మరిన్ని అక్రమాల ఆరోపణలు వస్తూండడంతో తీన్మార్ దినపత్రిక నిఘా టీం ప్రత్యేక విచారణలో ఆశ్చర్యకరమైన అక్రమ మరియు అనవసర లావాదేవీల సమాచారం కొన్ని ఆధారపూర్వకంగాను మరికొన్ని ఆరోపణలుగాను బహిర్గతం కావడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను నిర్వహిస్తున్న విద్స్ సంస్థ మంచి ఉద్దేశ్యంతో ముందుకు వచ్చిన ప్రాజెక్ట్ ఉద్దేశ్య లక్ష్య చేదనలో కార్యచరణ సంబంధిత వ్యవహారాల కల్పితమైన పరిశీలనకు కొంత మందిని కో ఆర్డినేటర్స్ (సీసీ మరియు ఏసీ) లని నియమించడం జరిగింది. కాగా వీరి బాధ్యత ఏరియా మరియు క్లస్టర్ల పరిధి %జఖీ% సెంటర్స్ లోని కౌన్సిలర్స్ విధులను పర్యవేక్షించడం, కో ఆర్డినేట్ చేయడం. ఐతే మిగతా కౌన్సిలర్స్ కన్నా వీరు ఉన్నత స్థాయిలో ఉన్న కారణంగా వారి పరిధిలోని మాటవినని (వారికి అనుకూలంగా లేని వారిని) లేదా వారు టార్గెట్ చేసిన కౌన్సిలర్స్ ని విధులలో, సందర్భానుసారంగా తోటి కౌన్సిలర్స్ ముందు కించపరచడం, ప్రత్యేకించి అధిక పనిభారం కల్పించడం, సమయం, సందర్భం లేకుండా విధులపేరుతో ఇబ్బందులకు గురిచేయడంలాంటి ఘటనలకు ప్రణాళికబద్దంగా గురిచేస్తూ.. వారి చెప్పు చేతల్లోకి తీసుకోని ఆర్థిక పరంగా.. కావాల్సినప్పుడు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఐతే తీన్మార్ దినపత్రిక నిఘా టీం ఆ కోణంలో బాధింపబడిన వారినుండి సమాచారం సేకరించడంలో భాగంగా వెలుగు చూసిన కొన్ని ఆధారాల పరిశీలిస్తే ఇవి ఆరోపణలు కాదు వాస్తవ దుశ్చర్య అనే అభిప్రాయానికి రాక తప్పదు. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో గల కొందరు కో ఆర్డినేటర్స్ (ఏసీ, సీసీ) ఇలాంటి అక్రమ సంపాదనకు పాల్పడుతున్నట్లు కొన్ని సంఘటనలు మరియు కొన్ని ఆధారాలు ఆరోపణలను బలపరుస్తున్నాయి. కాగా.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గల సీసీ మరియు ఏసీల కో ఆర్డినేటర్ బాధ్యతల నిర్లక్ష్యం, బాధ్యతల దుర్వినియోగం కొట్టచ్చినట్లు కనిపిస్తున్నది. ఆధారాలను పరిశీలిస్తే.. మొదటిది.. డబ్బుల డిమాండ్.. ఓ ఏరియా కోఆర్డినేటర్ డబ్బులకోసమే తెలివిగా ఇబ్బందిపెట్టి ఫోన్ పే ద్వారా డబ్బులు కొట్టించుకున్నట్టు ఆధారాలు లభించడం గమనార్హం. అంతే కాక ఈ ఏసీ మరియు సీసీల పరిధిలోనే ఓ మహిళా నిండు గర్భవతిగా ఉన్నప్పటికీ తనతో విధులు చేయించినట్టు, దానికి గాను జీతం చెల్లించినట్టు సమాచారం.. కాగా అట్టి గర్భిణీ మహిళ డెలివరీ కోసం హాస్పిటల్ లో జాయిన్ అయిన కాలం నుండి డెలివరీ అయ్యి బెడ్ రెస్ట్ లో ఉన్నా కూడా జీతం వేయడం జరిగిందని, తను డెలివరీకి ముందు కూడా విధులకు హాజరు కాకుండానే జీతాలం







ఏ డో వ ని, ఫోటోషాప్ ద్వారా ఫోటోలు ఎడిట్ చేసి ఏసీ, సీసీల సహకారం (కమీషన్ ల) ఉన్నదని తీవ్ర స్థాయి ఆరోపణలు వెలువడుతున్నాయి. కాగా గతంలో ఈ సంస్థలోనే ఓ మహిళ కౌన్సిలర్ ప్రెగ్నెంట్ గా ఉన్నప్పుడు సుమారు 5/7 నెల సమయంలోనే ముందస్తు ఆరోగ్య చర్యలతో విధుల నుండి తాత్కాలికంగా పక్కనపెట్టగా.. ప్రస్తుతం ఆరోపిస్తున్న నిండు గర్భిణీ మహిళా కౌన్సిలర్ విషయంలో ఈ చర్యకు కారణాలు కమీషన్లా లేక ఇంకేంటి అనే సందేహాలతో గల ఆరోపణలు గట్టిగానే వెలువెత్తుతున్నాయి. కాగా అట్టి సుమారు 8/9 నెలల గర్భిణీ మహిళను ఎలా బాధ్యతలకు పంపించారు, అసలే వీరికి ఇన్సూరెన్స్, ఈఎస్ఐ, పీఎఫ్ లాంటి బెనిఫిట్స్ కూడా ఏంలేదు కదా.. ఇంత నిర్లక్ష్యానికి కారకులు ఎవరూ.. యాజమాన్యం నిద్రిస్తుందా.. పర్యవేక్షణపై ద్యాస ఎందుకు లేదు.. ఏమైనా జరిగి ఉంటే బాద్యులు ఎవరూ.. ఏండినా.. సీసీనా.. ఏసీనా అనే సందేహాలను సైతం ఈ ఆరోపణలు.. ఆరోపణల ద్వారా మరిన్ని సందేహాలను రేకేత్తిస్తున్నాయి. కాగా తీన్మార్ దినపత్రిక, %జఖీ% ల నిర్వహణలో ఇట్టి ఆరోపణల వాస్తవరూప అన్వేషణలో ఆధారాలతో వెలుగుచూసిన డబ్బుల వసూళ్లకు సంబంధించి ఉమ్మడి వరంగల్ జిల్లాలో గల అందరూ ఏసీలు మరియు సీసీల (ఏరియా కో ఆర్డినేటర్స్ మరియు క్లస్టర్ కో ఆర్డినేటర్) పై విచారణ జరిపి అక్రమార్జనకు పాల్పడ్డ వారిపై, మరియు గర్భిణీ మహిళ విషయంలో వస్తున్న ఆరోపణలపై కూడా విచారణ జరిపి నిర్లక్ష్య/ అక్రమాలకు బాద్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం తప్పనిసరి. ఏ ఒక్క సరదర్భంలోనైనను అట్టి మహిళకు జరగరానిది జరిగి ఉంటే ఇంత గొప్ప సదుద్దేశ్యం గల ప్రాజెక్ట్ కే మాయని మచ్చలా నిలిచిపోయే అవకాశం కూడా లేకపోలేదు. ఇప్పటికైనను ఇలాంటి పరిస్థితి ఏ మహిళకు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం అవసరం. అంతే కాక ఈ అక్రమ వసూళ్లపై, మహిళా గర్భిణీ ఆరోపణల విషయంలో, నిన్నటి సంచికలో ప్రచురితం ఐన కథనం పై సంస్థ ఏ రకంగా చర్యలు తీసుకోనుందో తెలియాల్సి ఉంది.

## 85వ ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ లో తెలంగాణ బృందాలు

మొదటి పేజీ తరువాయి

ప్రసంగించారు. ముందుగా రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు చెప్పారు. భారత రాజ్యాంగాన్ని అనుసరించి పార్లమెంట్ రూపొందించిన చట్టాలు దేశంలో ప్రజాస్వామ్య బలోపేతానికి తోడ్పడుతున్నాయి. తద్వారా దేశ ప్రజల హక్కులు రక్షించబడుతున్నాయి. ముఖ్యంగా సమాచార హక్కు చట్టం, వస్తు సేవల పన్నులతో పాటుగా విద్య, వైద్యం, సామాజిక న్యాయం వంటి అంశాలలో పార్లమెంట్ రూపొందించిన చట్టాలు ఈ దేశ పౌరులకు ఉపయోగపడుతున్నాయని అన్నారు. ప్రజాస్వామ్యం, సమన్యాయం, సమానత్వంలు ప్రాథమిక అంశాలుగా రూపొందించిన భారతదేశ రాజ్యాంగం గత 75 సంవత్సరాలుగా ఈ దేశ ప్రజలకు మార్గదర్శనం చేస్తున్నదని అన్నారు. భారత రాజ్యాంగ విలువలకు, మార్గదర్శకాలకు అనుగుణంగా తెలంగాణ శాసనసభ పనిచేస్తుంది. తెలంగాణ ప్రజలకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పనలో, వాటిని చట్టాలుగా ఆమోదించడంలో తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఒక మోడల్‌గా ఉన్నది. మెజారిటీ ప్రజలకు సంబంధించిన వ్యవసాయం, నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు, సామాజిక పథకాలు, మౌళిక వసతుల కల్పన వంటి కీలక అంశాలకు తెలంగాణ శాసనసభ ప్రాముఖ్యత ఇచ్చింది. ముఖ్యంగా రైతుల భూ వివరాలకు ఉపయోగపడే భూ భారతి చట్టం, యువతకు సంబంధించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వంటి చట్టాల రూపకల్పన ద్వారా తెలంగాణ శాసనసభ మెజారిటీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్నదని సగర్వంగా చెప్పగలను అని వెల్లడించారు. రాష్ట్ర జనాభాలో మెజారిటీగా ఉన్న రైతుల ప్రయోజనం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అధిక నిధులను కేటాయిస్తుంది. రైతుభరోసా పెంపు, రైతుభీమా అమలు ద్వారా రైతాంగానికి అండగా ఉన్నది. ప్రభుత్వ గురుకుల, ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికి ప్రభుత్వం మెస్ చార్జీలను భారీగా పెంచింది. విద్యార్థులకు అందుతున్న సేవలను పర్యవేక్షించడానికి ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు, ఉన్నతాధికారులు తరుచుగా గురుకుల పాఠశాలను తనిఖీ చేస్తున్నారు. మహిళలను గౌరవిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తుంది. ప్రభుత్వ బస్సులలో చిరు ఉద్యోగ, వ్యాపారాలు చేసే మహిళలు మరియు విద్యార్థినులకు ఉచిత ప్రయాణంతో ఆర్థికభారం తగ్గింది. రూ.500లకే సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌తో మహిళలకు గృహ నిర్వాహణ సులభమైందని చెప్పారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నడుచుకుంటూ తెలంగాణ ప్రజల సంక్షేమానికి ఉపయోగపడే చట్టాల రూపకల్పనకు కృషి చేస్తున్న తెలంగాణ శాసనసభ్యులను అభినందిస్తున్నాను. మనమందరం రాజ్యాంగ విలువలను పాటిస్తూ ఇదే విధమైన స్ఫూర్తిని కొనసాగిస్తూ ముందుతరాలకు ఆదర్శంగా నిలవాలని కోరుకుంటున్నాను అని సూచించారు.

## జలసౌధ లో కృష్ణా నది యాజమాన్య బోర్డ్ సమావేశం

హైదరాబాద్, జనవరి 21 (తీన్మార్ న్యూస్): మంగళవారం రోజున హైదరాబాద్ లోని జలసౌధ లో కృష్ణా నది యాజమాన్య బోర్డ్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ, ఏపీ ఇరిగేషన్ సెక్రటరీలు, ఈఎన్సీలు హాజరయ్యారు. అనంతరం కృష్ణా నది నీటి వాటాల పంపకం, ఉమ్మడి ప్రాజెక్టులు, రెండు రాష్ట్రాల్లో నిర్మిస్తున్న ప్రాజెక్టులపై ఈ సమావేశంలో చర్చించారు. అలాగే నారాయణపేట కొడంగల్ ప్రాజెక్ట్, అచ్చంపేట సుంకిశాల, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులపై ఏపీ అధికారులు అభ్యంతరాలు తెలిపగా రాయలసీమ పోతిరెడ్డిపాడు విస్తరణ, ఆర్డీఎస్ కుడి కాలువపై ఏపీ ప్రభుత్వం చేపట్టిన పనులపై తెలంగాణ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. కాగా ఈ సమావేశానికి సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## అర్హుల ఆందోళనలతో మరో ఛాన్స్

మొదటి పేజీ తరువాయి



పర్యటిస్తున్నారు. దరఖాస్తుల స్వీకరణ, లబ్దిదారుల ఎంపికను స్వయంగా పరిశీలించనున్నారు. ఏమైనా లోటుపాట్లు ఉంటే వెంటనే పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. గ్రామ సభల్లోనే పథకాల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలన్నది ప్రభుత్వం ఆలోచన. దానివల్ల ప్రజలకు ఎలాంటి సమస్య ఉండదని భావిస్తోంది. ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు కోసం ఇప్పటికే లబ్దిదారుల ఎంపిక పూర్తి చేశారు. అర్హుల జాబితాలు ఆయా గ్రామాలు, వార్డులకు చేరాయి. కొన్ని చోట్లయితే తమ పేర్లు లేవని అర్హులు ఆందోళన చెందడంతో వారికి మరో ఛాన్స్ ఇచ్చింది ప్రభుత్వం. కేవలం కొత్త దరఖాస్తులు మాత్రమే కాకుండా, రేషన్ కార్డుల విషయంలో కొత్తగా పేర్లు చేర్చడానికి అప్లికేషన్లు తీసుకుంటున్నారు. ఈనెల 26 నుంచి నాలుగు స్కీమ్‌లను ప్రభుత్వం ఒకేసారి ప్రారంభిస్తోంది. దీంతో అర్హుల ఎంపికలో అధికారులు తనమునకలయ్యారు. బీఆర్ఎస్ హయాంలో రైతు బందు స్కీమ్, గుట్టలు, క్వారీలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, సాగు యోగ్యం కాని భూములకు ఇచ్చారు. ఇప్పుడు వాటిని తొలగించినుంది ప్రభుత్వం. అర్హులైన లబ్దిదారులకు ఆయా పథకాలను వర్తింపజేయనున్నారు. దీనిపై జనవరి 16 నుంచి 19 వరకు అధికారులు ప్రతీ ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించిన విషయం తెల్సిందే. ప్రస్తుతం నిర్వహిస్తున్న గ్రామ, వార్డు సభల్లో కొత్త అప్లికేషన్లతోపాటు ఇప్పటికే రూపొందించిన జాబితాలో అనర్హులను తొలగించనున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అక్కడక్కడ చిక్కులు సైతం లేకపోలేదు. గతంలో ఉపాధి హామీ కూలీల ఆదార్ నెంబర్‌లో జరిగిన పొరపాట్లను సవరించనున్నారు. దీనికి సంబంధించి ఆర్డీవోలను ఇప్పటికే మంత్రులు కూడా ఆదేశించారు.

## హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్

హైదరాబాద్, జనవరి 21(తీన్మార్ న్యూస్): హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు పనులను కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం హుస్సేన్ సాగర్ వద్దగల బుద్ధభవన్ లో హైడ్రా పీఎస్ ఏర్పాటు చేయాలంటూ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా మంగళవారం పీఎస్ పనుల పురోగతిపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ ఫిబ్రవరి మొదటివారంలో హైడ్రా పీఎస్ ప్రారంభం కానున్నట్లు తెలియజేశారు. హైడ్రా పీఎస్ ఎస్‌హెచ్‌వోగా ఏసీపీ స్థాయి అధికారిని, మూడు జోన్లలో ఒక్కో జోన్‌కు ఎస్పీ స్థాయి అధికారులను నియమించనున్నట్టు వెల్లడించారు. అదేవిధంగా కేసుల సత్వర పరిష్కారానికి హైడ్రా ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని పేర్కొన్నారు. కాగా హైదరాబాద్ లో చెరువులు, కుంటలు, నాలాలు, పార్కుల స్థలాల పరిరక్షణకు ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసి, ప్రత్యేక అధికారాలు కట్టబెట్టింది. తాజాగా హైడ్రాకు ప్రత్యేక పోలీస్ స్టేషన్ కూడా మంజూరు చేసింది.




## 75 సం. రాజ్యాంగ ప్రదర్శనకు గణతంత్ర దినోత్సవ పరేడ్

న్యూ ఢిల్లీ, జనవరి 21 (తీన్మార్ న్యూస్): గణతంత్ర దినోత్సవ పరేడ్ 2025 రాజ్యాంగం మరియు జన్ భగీదారి అమలులోకి వచ్చిన 75 సంవత్సరాలపై ప్రత్యేక దృష్టి సారించి భారతదేశ సాంస్కృతిక వైవిధ్యం మరియు సైనిక పరాక్రమాన్ని ప్రదర్శించడానికి సిద్ధంగా ఉంది. ఈ సంవత్సరం, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో కవాతుకు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. న్యూఢిల్లీలో మీడియాను ఉద్దేశించి రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, భారత సాయుధ బలగాలతో పాటు కర్తవ్య మార్గంలో జరిగే కవాతులో ఇండోనేషియా నుండి 160 మంది సభ్యుల కవాతు బృందం మరియు 190 మంది సభ్యుల బ్యాండ్ బృందం పాల్గొంటుందని ప్రకటించారు. స్వర్ణిమ్ భారత్: విరాసత్ ఔర్ వికాస్ అనే థీమ్‌ను ప్రదర్శిస్తూ వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు మరియు కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు మరియు విభాగాల నుండి 31 పట్టికలు కూడా పాల్గొంటాయని ఆయన తెలిపారు. రాజ్యాంగం యొక్క 75 సంవత్సరాల జ్ఞాపకార్థం పరేడ్ సందర్భంగా రెండు పట్టికలు ఉంటాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది. పూల అలంకరణలు మరియు వీక్షణ కట్టర్లు థీమ్‌ను హైలైట్ చేస్తాయి మరియు కార్యక్రమం ముగింపులో, ప్రత్యేక సందేశ బ్యానర్‌తో కూడిన బెలూన్‌లు విడుదల చేయబడతాయి. దేశం మరియు సమాజ నిర్మాణానికి వారు చేసిన కృషిని గౌరవించేందుకు 34 వర్గాల నుండి సుమారు పది వేల మంది ప్రత్యేక అతిథులు ఆహ్వానించబడ్డారు. ముఖ్య ప్రభుత్వ పథకాల్లో రాణిస్తున్న గ్రామాల సర్పంచ్‌లతో సహా ఈ అతిథులను ప్రభుత్వ ప్రత్యేక అతిథులుగా ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు ఎంపిక చేశారు. ఈ వ్యక్తులు స్వర్ణిమ్ భారత్ స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ తమ తమ రంగాలలో సాధకులు మరియు అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్నారని మంత్రిత్వ శాఖ ఉద్ఘాటించింది.



## సమస్యలకు కేరాఫ్‌గా హైదరాబాద్



హైదరాబాద్, జనవరి 21 (తీన్మార్ న్యూస్): గ్రేటర్ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో భేటీ అనంతరం ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ సమస్యలకు కేరాఫ్‌గా హైదరాబాద్ మారిందని అన్నారు. కాంగ్రెస్ హామీలు అమలు చేసేవరకు పేదల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని కీలక ప్రకటన చేశారు. తెలంగాణ గ్రోత్ ఇంజిన్ ను కాపాడాల్సిన బాధ్యత ఈ రాష్ట్రాన్ని సాధించిన తమపై ఉందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజలు ఎదుర్కుంటున్న పారిశుధ్య ఇబ్బందులు, తాగునీటి సమస్య పరిష్కారానికి బీఆర్ఎస్ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. హైదరాబాద్ సమస్యల పరిష్కారం, నగర ప్రజలకు కలిగించాల్సిన భరోసాపై ఎమ్మెల్యేలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పాలనలో రోడ్లపై బిందెలు దర్శనమిచ్చిన రోజు ఒక్కటి కూడా లేదని అన్నారు. ప్రపంచ స్థాయి ప్రాజెక్టులు నగర రూపురేఖల్నే మార్చేశాయని తెలిపారు. కేసీఆర్ అమలుచేసిన సమగ్రమైన ప్రణాళికలతో హైదరాబాద్‌లో శాంతిభద్రతలు సైతం చెక్కుచెదరకుండా ఉన్నాయని అన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం ఏడాది కాలంగా హైదరాబాద్‌లోని పేదలు ఎదురు చూస్తున్నారన్నారు. అర్హులైన అందరికీ రేషన్ కార్డులు, రైతుభరోసా అందేలా బీఆర్ఎస్ నేతలు చూడాలని కేటీఆర్ ఆదేశించారు. బీఆర్ఎస్ హయంలో కంచెలు వేసి కాపాడిన ప్రభుత్వ పార్కులకు కూడా రేవంత్ సర్కార్ పాలనలో రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. రోజూ అనేకచోట్ల కబ్జా జరుగుతోందని ఆరోపించారు. గత ఎన్నికల్లో కుల, మత, ప్రాంతాలకు అతీతంగా హైదరాబాద్ ప్రజలంతా బీఆర్ఎస్‌కు పట్టం కట్టారని వారి బాధలు తీర్చాలని బాధ్యత తమపై ఉందని ఎమ్మెల్యేలకు సూచించారు.

## నిరుద్యోగ యువతకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శుభవార్త

న్యూ ఢిల్లీ, జనవరి 21 (తీన్మార్ న్యూస్): నిరుద్యోగ యువతకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి భారీ శుభవార్త చెప్పారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాబోయే రోజుల్లో 5 లక్షల ఉద్యోగాలు కల్పించబోతున్నట్లు కీలక ప్రకటన చేశారు. బొగ్గు రంగంలో 5 లక్షల ఉద్యోగాల కల్పనకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. ఏడాదికి రెండు బిలియన్ టన్నుల బొగ్గు అవసరమని అభిప్రాయపడ్డారు. 2014తో పోలిస్తే బొగ్గు ఉత్పత్తి 76 శాతం పెరిగిందని అన్నారు. 2040 నాటికి గరిష్ట స్థాయికి బొగ్గు డిమాండ్ ఉంటుందని తెలిపారు. నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని తెలుగు రాష్ట్రాలకు కిషన్ రెడ్డి సూచనలు చేశారు. ఇదిలా ఉండగా సోమవారం ఒడిశాలోని కోణార్క్‌లో జరిగిన రాష్ట్రాల బొగ్గు, గనులశాఖ మంత్రుల మూడో జాతీయ సదస్సులోనూ కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుతం దేశంలో బొగ్గు ద్వారానే 72% విద్యుదుత్పత్తి జరుగుతోందన్నారు. ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతుండటం, పారిశ్రామికీకరణ వేగంగా జరుగుతుండటంతో విద్యుదుత్పత్తి కూడా పెరుగుతోందన్నారు.

## ఫేక్ వెబ్‌సైట్స్ గుర్తించండి

మొదటి పేజీ తరువాయి

ఆయన నకిలీ వెబ్‌సైట్- ఒరిజినల్ వెబ్‌సైట్ మధ్య తేడాను గుర్తించలేక అమాయక ప్రజలు సైబర్ వలలో చిక్కుకుంటున్నారని, లక్షల్లో మోసపోతున్నారని తెలిపారు. అలాగే ఏదైనా వెబ్‌సైట్ పేరులో యూఆర్ఎస్ ఉంటే కచ్చితంగా దీనికి ముందు హెచ్‌టీటీపీ అని ఉంటుందని, అలా లేదంటే అది నకిలీ వెబ్ సైటేనని స్పష్టం చేశారు. అంతేగాక వెబ్‌సైట్ ఓపెన్ చేసిన వెంటనే మరో వెబ్ సైట్ కి వెళుతుంటే కచ్చితంగా అది నకిలీదని గమనించాలని సూచించారు. ఇక అనుమానాస్పద వెబ్ సైట్ లపై 1930 కి ఫిర్యాదు చేయండి అని సజ్జనార్ చెప్పారు.

## ప్రభుత్వానికి టీ - సర్పంచుల సంఘం జేఏసీ బహిరంగ లేఖ

మొదటి పేజీ తరువాయి

చేసింది. ఈ లేఖలో ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతున్న గ్రామాలలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని కోరింది. అలాగే 2019 నుంచి 2024 వరకు గ్రామాలను అభివృద్ధి చేసిన తాజా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించలేదు. కావున సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బిల్లులు చెల్లించకుండా ఎన్నికలు నిర్వహిస్తే బిల్లులు బాకీ ఉన్న సర్పంచులం అడ్డుకుంటామని హెచ్చరించింది. ఈ పోరాటంలో మా మీద కేసులైన పరవాలేదని, మా ప్రాణాలు పోయినా పర్వాలేదని తేగేసి చెప్పింది. మా బిల్లులు మాకు చెల్లించాలని, డబ్బులు అప్పులకు తెచ్చి అభివృద్ధి పనులు చేసామని, వడ్డీలకు ఇచ్చిన వారితో వేధింపులు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేసింది. అలాగే కొంతమంది సర్పంచుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ సూసైడ్ చేసుకున్నారని తెలిపింది. అయినా ప్రభుత్వం మా పైన కక్ష సాధింపు జరుపుతున్నదని, ప్రభుత్వం మా బిల్లులు చెల్లించి, ఎన్నికలు నిర్వహించాలని లేఖలో పేర్కొన్నది. ఇక స్థానిక సంస్థల ఎన్నికలు కులగణన పూర్తి అయిన తర్వాతే రిజర్వేషన్లు ఏర్పాటు చేసి నిర్వహించాలని కోరుకుంటున్నామని సర్పంచుల సంఘం జేఏసీ వెల్లడించింది.

## తెలంగాణలో రానుంది బీజేపీ ప్రభుత్వమే


మొదటి పేజీ తరువాయి



సాధ్యం కానీ హామీలను ఇచ్చి హస్తం పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఇచ్చిన ఆరు గ్యారంటీ ల్లో ఏ ఒక్కటి కూడా సక్రమంగా అమలు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. ఎన్నికల సందర్భంగా తులం బంగారం, ప్రతి మహిళలకు రూ.2,500 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆక్షేపించారు. ఆసరా పింఛన్లను రూ.4 వేలకు పెంచుతామని చెప్పి మొండి చేయి చూపించారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో శూన్య హస్తమే మిగిలిందని సెటైర్లు వేశారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ వేస్తామని చెప్పి మోసం చేశారని తెలిపారు. ఇలా అన్ని హామీలను కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విస్మరించిందని ప్రజలు అన్ని విషయాలను గమనిస్తూనే ఉన్నారని హెచ్చరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త కష్టపడి పని చేసి పార్టీని నిలబెట్టాలని ఈటల పిలుపునిచ్చారు.

## రాష్ట్రపతి భవన్‌లోని అమృత్ ఉద్యానవనం

న్యూ ఢిల్లీ, జనవరి 21 (తీన్మార్ న్యూస్): రాష్ట్రపతి భవన్‌లోని అమృత్ ఉద్యానవనం వచ్చే నెల 2వ తేదీ నుంచి మార్చి 30వ తేదీ వరకు ప్రజల సందర్శనార్థం అందుబాటులో ఉంటుంది. ప్రజలు సోమవారం మినహా వారానికి ఆరు రోజులు ఉదయం 10 నుండి సాయంత్రం 6 గంటల వరకు ఉదయన్‌ని సందర్శించవచ్చు. గార్డెన్‌కి బుకింగ్ మరియు ప్రవేశం ఉచితం మరియు రాష్ట్రపతి భవన్ వెబ్‌సైట్ నుండి చేయవచ్చు. రాష్ట్రపతి భవన్ మార్చి 6వ తేదీ నుంచి అమృత్ ఉద్యానలో భాగంగా నాలుగు రోజుల వివిధతా కా అమృత్ మహోత్సవ్‌ను కూడా నిర్వహించనుంది. మహోత్సవ్ దక్షిణ భారతదేశంలోని గొప్ప సాంస్కృతిక వారసత్వం మరియు విశిష్ట సంప్రదాయాలను ప్రదర్శిస్తుంది.



తీన్మార్
తెలుగు దినపత్రిక

## సోషల్ మీడియాతో యుద్ధం

సోషల్‌మీడియా చెడ్డదేం కాదు.. అలాగని మంచిది కూడా కాదు. వివాదాలు ముదిరి విద్వేషం పెరిగి ఆలోచనలను తొక్కేసి లక్ష్యాలను వెనక్కి నెట్టేసి అన్నట్లుగా సోషల్‌మీడియా తీరు ఇప్పుడు కనిపిస్తుంది. చాలా మంది ఎప్పుడూ ఎవరో ఒకరి మీద విద్వేషంతో ఊగిపోతున్నారు. ముఖ్యంగా సినిమా హీరోల అభిమానుల విషయంలో మరీ ఎక్కువైంది. తమ హీరో సినిమా రిలీజైతే ఒకలా వేరొక హీరో సినిమా రిలీజైతే మరొకలా రెచ్చిపోతున్నారు. ఓ దరిద్రపు ట్రెండ్ స్టార్ట్ చేశారు. ఎలాగైనా వేరే హీరోల సినిమాలు ఫ్లాఫ్ చేయాలని కంకణం కట్టుకుని తిరుగుతున్నారు. ట్రోలింగ్ చేయడానికి, ఎదుటి వారిని కించపరచడానికి సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నారు. గుంటూరు కారం నుంచి ఇప్పుడు గేమ్‌ఛేంజర్ వరకు అదే జరిగింది. సినిమాని తొక్కేయాలని కొందరు యాంటీ ఫ్యాన్స్ రచ్చ చేశారు. నెగిటివ్ రివ్యూలు ప్రచారం చేశారు. వీడియో లింక్‌లు ఇచ్చేశారు. నార్త్, ఓవర్సీస్‌లో థియేటర్లు ఖాళీగా ఉన్నాయంటూ ట్రోలింగ్ చేశారు.గేమ్ ఛేంజర్ ఫస్ట్ డే కలెక్షన్ల పోస్టర్ మీద జరిగిన రచ్చ అంతా ఇంతా కాదు. దీంతో మళ్లీ గేమ్ ఛేంజర్ కలెక్షన్ పోస్టర్లను మూవీ యూనిట్ రిలీజ్ చేయలేదు. ఎవరు చేస్తున్నారో, ఎలా చేస్తున్నారో కానీ గేమ్‌ఛేంజర్ మొదటి నుంచి టార్గెట్‌గానే కనిపించింది. ట్రైలర్ రిలీజ్ చేసినప్పుడే ఓ తప్పుడు వీడియోను వైరల్ చేశారు. థియేటర్‌లో హీరో ట్రైలర్ ఈవెంట్ కు అక్కడ జనాలు లేరని, మూలన కూర్చుని బాధపడుతున్నట్టుగా వీడియో ఒకటి షేర్ చేసి ట్రోలింగ్ చేశారు. నిజమా అబద్ధమా అని తెలుసుకోకుండా, చూసుకోకుండా వైరల్ చేసేశారు. ఇలాంటి నెగిటివ్ ట్రోలింగ్ మధ్య ఆ మూవీ వచ్చింది. రిలీజ్ తర్వాత కూడా అదే నెగిటివ్ ట్రెండ్ కంటిన్యూ అయింది.పరిణామాలపై మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాట్లాడిన మాటలు ఇప్పుడు ప్రతీ ఒక్కరిని కదలిస్తున్నాయ్. ట్రోలింగ్ సినిమాను చంపేస్తుందని ఆవేదన వ్యక్తం చేశాడు. నెగిటివ్ ట్రోల్స్ వల్ల తెలుగు సినిమా ఇండస్ట్రీ పరువు పోతుందని దయచేసి ఇది మానుకోవాలని సూచించాడు. తెలుగు సినిమా ట్రోలింగ్ చూస్తుంటే భయంగా ఉందని అదే సమయంలో సిగ్గుగా ఉందని తమన్ ఆవేదన వ్యక్తం చేయగా అతని మాటలు తనను కదిలించాయని చిరంజీవి ట్వీట్ చేశారు. విషయం సినిమా అయినా క్రికెట్ అయినా మరో సామాజిక సమస్య ఏదైనా సోషల్ మీడియా వాడుతున్న ప్రతి ఒక్కరు తమ మాటల తాలూకు ప్రభావం అవతలి వ్యక్తుల మీద ఎలా ఉంటుందో ఆలోచించుకోవాలని సూచించారు. మాటలు ఫ్రీనే అని ఐతే అవి ప్రేరేపించగలవని, ఆ మాటలే నాశనం చేయగలవని ఇందులో మీరు ఏమి చేయాలనుకుంటున్నారో ఎంచుకోండి అంటూ రాసుకొచ్చారు. దీంతో ఇప్పుడు ట్రోలింగ్ వ్యవహారం మళ్లీ తెరమీదకు వచ్చింది.సోషల్‌మీడియా వాడకం పెరిగిపోయాక దిక్కుమాలిన దరిద్రాలన్నీ మొదలయ్యాయ్. ఏ హీరో సినిమా అయినా అందరి ఫ్యాన్స్ కలిసి ఎంజాయ్ చేసే వాళ్లు ఒకప్పుడు. అలాంటిది ఇప్పుడు తమ హీరోనే గొప్ప అని అర్థం లేని యుద్ధానికి దిగుతున్నారు. అక్కడితో ఆగుతున్నారా అంటే ఓవరాల్‌గా సినిమాను చంపేస్తున్నారు. ఇప్పుడు గేమ్ ఛేంజర్ అని మాత్రమే కాదు. గతంలో చాలా మంది హీరోల విషయంలో ఇదే జరిగింది. ఏం పాపం చేశా, ఎందుకిలా అంటూ కిరణ్ అబ్బవరంలాంటి వాళ్లు స్టేజీ మీదే ఎమోషనల్ అయ్యారు. మరికొందరు అయితే నెక్స్ట్ సినిమా ఒప్పుకునేందుకు కూడా ఆలోచిస్తున్నారు. హీరోల మనోధైర్యాన్ని ట్రోలింగ్ ఇంతలా దెబ్బతీస్తోంది. ఆ హీరో అంటూ వాడు ఈ హీరో అంటూ వీడు ఎవడికి వాడు హీరో పేరు చెప్పుకొని విలన్‌గా మారుతున్నాడు. సినిమా ప్రాణం తీస్తున్నారు. దీంతో ఈ ఫ్యాన్ వార్ నిర్మాతలకు ప్రాణసంకటంగా మారుతున్న పరిస్థితి. తమ అభిమాన హీరో కోసం ఫ్యాన్స్ మిగిలిన హీరోలపై విషం చిమ్ముతూ చేస్తున్న ప్రచారంతో కొన్ని సినిమాలు బాక్సాఫీస్ దగ్గర బోల్తాపడుతున్న పరిస్థితి. అసలే ఓటీటీ కాలం ప్రేక్షకుడిని థియేటర్‌కు తీసుకురావడమే గగనం అయింది. అలాంటిది ఈ నెగిటివ్ ట్రోలింగ్ థియేటర్‌కు వెళ్లాలన్న కోరికలను కూడా చంపేస్తోంది. ఇండస్ట్రీ మీద ఎఫెక్ట్ చూపిస్తోంది.ఒకసారి ఒక హీరో సినిమాపై మరో హీరో అభిమానులు నెగెటివిటీ ప్రచారం చేస్తే ఆ హీరో వంతు వచ్చినప్పుడు తాము అదే చేస్తామని వార్నింగ్ ఇస్తున్నారు. సినిమా అలా రిలీజ్ అవగానే ఇలా నెగిటివ్ ట్రోలింగ్ స్టార్ట్ చేస్తున్నారు. వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. నెగిటివ్ రివ్యూలు ఇస్తున్నారు. ఇలా ఫ్యాన్ వార్‌తో టాలీవుడ్‌లో నాన్సెన్స్ ఎక్కువైపోయింది. తెలుగు సినిమా గురించి ప్రపంచం మాట్లాడుకుంటున్న సమయంలో మన పరువు మనమే తీసుకున్నట్లు అవుతోంది. తమన్ చెప్పింది అదే. అర్థం చేసుకోండని చిరు సూచించింది కూడా అదే. గేమ్ ఛేంజర్ మూవీ విషయంలోనే కాదు గతంలో చాలాసార్లు ఇలానే జరిగింది. ఈ టార్చర్ తట్టుకోలేక కొందరు దర్శకులు, హీరోలు పోలీస్‌స్టేషన్ మెట్లు కూడా ఎక్కారు.థియేటర్‌కు ప్రేక్షకుడిని తీసుకురావడమే ఇబ్బందిగా మారుతున్న సమయంలో ఇండస్ట్రీని ఈ ట్రోలింగ్ మరింత దెబ్బతీస్తోంది. ఫ్యాన్ వార్ అనేది ఓవరాల్‌గా ఇండస్ట్రీకే సవాల్‌గా మారింది. పరిస్థితి ఇలానే కొనసాగితే సినిమా ఇండస్ట్రీ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుంది. సోషల్‌మీడియా ఫ్లాట్‌ఫామ్స్‌ను అభిమానం పేరుతో కొందరు అడ్డగోలుగా వాడేస్తున్నారు. తమ హీరోను హైలైట్ చేస్తూ ఇంకో హీరోను టార్గెట్ చేస్తున్నారు. ఫ్యాన్ వార్‌కు తెరతీస్తున్నారు. ఒకరకంగా కోలీవుడ్ కల్చర్‌ను టాలీవుడ్‌లోనూ తీసుకువస్తున్నారు. ఇది నిర్మాతలకు ఇబ్బందిగా మారుతోంది. తమన్ ఆవేదన కూడా అదే. ఇకపై సినిమా అవకాశాలు వస్తాయో రావో కూడా అర్థం కావడం లేదు అన్నాడంటే ట్రోలింగ్ మధ్య ఇండస్ట్రీ ఎంతలా నలిగిపోతుందో అర్థం చేసుకోవచ్చుఓ స్టార్ హీరో సినిమాకు ఎంత పాటిజివిటీ కనిపిస్తుందో అంతే స్థాయిలో నెగెటివిటీ వస్తుంది. ఒక్కసారిగా యాంటీ ఫ్యాన్స్ అంతా కలిసి మూవీని ట్రోలింగ్ స్టార్ చేస్తే ఎలా ఉంటుంది అనడానికి గేమ్ ఛేంజర్ బెస్ట్ ఎగ్జాంపుల్. మొదటిరోజే ఊఆ ప్రింట్‌తో సినిమాను లీక్ చేసి పడేశారు. థియేటర్‌లోనే ట్రోలింగ్ వీడియోలు, రీల్ వీడియోలు చేస్తున్నారు. పని గట్టుకుని మరీ పాతాళంలోకి తొక్కేయాలని చూస్తున్నట్లు కనిపించింది. ఇప్పుడు గేమ్‌ఛేంజర్ మాత్రమే కాదు గతంలో చాలామంది హీరోలు ఈ ట్రోలింగ్ బారిన పడ్డారు. దేవర మూవీ మీద కూడా నెగిటివ్ ట్రెండ్ చేసారు. మహేష్ బాబు గుంటూరు కారం కూడా ట్రోలింగ్ బాధిత సినిమానే.

# అర్హులను ఎంపికకు ప్రజల సమక్షంలో గ్రామసభలు నిర్వహిస్తున్నాం

**– భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 21 (తీన్మార్ న్యూస్): సంక్షేమ పథకాలు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి అర్హులను ఎంపిక చేసేందుకు ప్రజల సమక్షంలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మంగళవారం చిట్యాల మండలం చల్లగరిగ, రేగొండ మండలం సుల్తాన్ పూర్, గణపురం మండలం కర్కపల్లిలో జరిగిన ప్రజాపాలన గ్రామసభల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుండి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు జారీకి ఈ నెల 16 నుండి 20వ తేది వరకు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేశారని అట్టి జాబితాను ఫైనల్ చేయుటకు ప్రజల అభిప్రాయాలు సేకరణకు ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రజల. మధ్యలో ఎంపిక జరగాలని నిష్పక్షపాతంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పథకాల అమలులో భాగంగా 21 నుండి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలలో గ్రామస్తులను, ఇందిరమ్మ కమిటీలను భాగస్వాములను చేస్తున్నామని అన్నారు. ఏటా నియోజకవర్గానికి 3500 ఇళ్ళు ఇస్తున్నామని, ఇలా రానున్న నాలుగేళ్ల కాలంలో ప్రతి పేదవాని సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముందుగా ఉండటానికి గూడు లేని నిరుపేదలకు అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. జాబితాలో పేర్లు రాని అర్హులైనవారు గ్రామ సభల్లో కానీ ఎంపీడీవో కార్యాలయంలో కానీ దరఖాస్తులు ఇవ్వాలని అట్టి దరఖాస్తులను విచారణ నిర్వహించి వారికి సంక్షేమ కార్యక్రమాలు అందే విధంగా చర్యలు తీసుకుంటామని సూచించారు. పథకాలు అమలు అనేది నిరంతర ప్రక్రియ అని ప్రజలు సహకారం అందించాలని సూచించారు. గత పది సంవత్సరాలు కాలంలో ఒక రేషన్ కార్డు ఇవ్వలేదని కానీ తమ ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు మంజూరుకు చర్యలు చేపట్టిన వివరించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రానున్న ఉగాది నుండి సన్న బియ్యం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. సన్నవడ్లకు 500 రూపాయలు బోనస్ కూడా ప్రభుత్వం చెల్లిస్తున్నదని తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రోజుకు 18 గంటలు పనిచేస్తున్నట్లు ఆయన వివరించారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందిస్తామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ధరణి ద్వారా జరిగిన తప్పులను సరి చేసేందుకు భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం అమలు తీసుకొచ్చిందని తద్వారా క్షేత్రస్థాయి విచారణలో గుర్తించిన అన్ని వ్యవసాయ భూములకు రైతు భరోసా చెల్లిస్తామని తెలిపారు. ఈ నూతన చట్టం ద్వారా వ్యవసాయ యోగ్యమైన భూములకు సంవత్సరానికి 12 వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకం పనులను ప్రామాణికంగా తీసుకొని సంవత్సరానికి 12 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. గ్రామసభల్లో ప్రజలు తమ అభ్యంతరాలు తెలియజేయాలని ఆయన సూచించారు. పేద వర్గాలు చాలామంది ఉన్నారని రానున్న నాలుగు సంవత్సరాలు కాలంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అదే విధంగా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 21 వేల కోట్ల రూపాయలు రైతులకు రుణమాఫీ చేసి దేశంలో ఏ ప్రభుత్వం చేసినటువంటి సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రజలకు జవాబు దారితనంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 55 వేల ఉద్యోగాలు నియమాకం చేశామని ఆయన తెలిపారు. ఇప్పటివరకు పట్టాదారు పాసుపుస్తకాలు లేని రైతులకు త్వరలోనే పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేస్తామని తద్వారా బ్యాంకు నుండి రుణాలు, రైతు భరోసా వంటి పథకాలు ద్వారా ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని, ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పథకాలు అమలు అనేది నిరంతర ప్రక్రియనని ప్రజల ఆందోళన పడాల్సిన అవసరం లేదని ఏదైనా అభ్యంతరాలు ఉంటే దరఖాస్తులు ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారులు చిన్నయ్య, డాక్టర్ కుమారస్వామి, తహసిల్దార్లు హేమ, సత్యనారాయణ స్వామి, ఎంపీడీవోలు వెంకటేశ్వర్లు, భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్లు కిష్టన్న, శ్రీదేవి, సింగిల్ విండో చైర్మన్ విజ్జనరావు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారు లు తదితరులు పాల్గొన్నారు.

# వెదురు సాగుతో లాభాలు

**– జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి**



మహబూబాబాద్ జిల్లా, జనవరి 21 (తీన్మార్ న్యూస్): వెదురు సాగు తో వెయ్యి ఉపయోగాలు మరియు ఎకరానికి లక్ష రూపాయల ఆదాయం ఉంటుందని, మార్కెట్ డిమాండ్ మారుతున్న అవసరాలకు అనుగుణంగా వెదురు బొంగుల సాగు రైతులకు ఆర్థికంగా ఎదగడానికి తోడ్పడుతుందని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జీనుగు మరియన్న అన్నారు. మంగళవారం జిల్లాలోని నరసింహులపేట మండలంలోని కౌసల్యదేవి పల్లి గ్రామంలో రైతుల వెదురు సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ రోజు వారీ వస్తువుల ఉపయోగాలు, వ్యవసాయ పనిముట్లు, పందిరి సాగు కొరకు, పలు పరిశ్రమలు, రెస్టారెంట్లు నిర్మాణం, నౌకాశ్రయం, విమాన రంగం, ఉపగ్రహ ప్రయోగలకు, విద్యుత్ ఉత్పత్తి, క్లాత్ ఇండస్ట్రీ, మొదలైన వాటి లో వెదురు ను ఉపయోగిస్తున్నారన్నారు. కనుక రైతులు పండ్ల తోటలు, ఆయిల్ పామ్ తోటలు, చెలకల చుట్టూ బౌండ్రి ప్లాంటేషన్ గా, బంజర భూములు లో ప్యూర్ ప్లాంటేషన్ (వెదురు తోటలు వలె) నాటడం వలన మంచి ఆదాయం పొందవచ్చునని ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా అన్ని రకాల వస్తువులుగా వెదురు బొంగులను ఉపయోగించవచ్చునన్నారు. పబ్లిక్ గార్డెన్స్, ప్రైవేటు గార్డెన్స్, మొదలైన ప్రదేశాల లో వెదురు ఆక్సిజన్ క్లబ్స్ ఏర్పాటు చేసుకోవడం వలన పర్యావరణహితమైనదని వెదురు సాగు కు ఎకరానికి 10 వేల రూపాయలు రాయితీ సౌకర్యం ఉందని. కనుక రైతులందరూ వెదురు సాగును చేపట్టి ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ఈ సందర్భనలో అధికారి వెంట రైతులు ఉన్నారు.

## ఎక్సయిజ్ దాడుల్లో 4 అరెస్ట్ 20 లీటర్ల గుడుంబా స్వాధీనం





పరకాల, జనవరి 21 (తీన్మార్ న్యూస్): గుడుంబా నిర్మూలన స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ఈరోజు పరకాల ఎక్సయిజ్ స్టేషన్ పరిధిలోని పోచారం, గట్ల కానిపర్తి, కామారెడ్డి పల్లి, పరకాలలో దాడులు నిర్వహించి పరకాలకు చెందిన సాదు సరోజన, గట్ల కానిపర్తి కి చెందిన మోరె మదనమ్మ, ఆకునూరి మమత, బొమ్మ శారద లను అరెస్ట్ చేసి వారివద్ద నుండి (20) లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ దాడులలో సీఐ పి.తాతాజీ, ఎస్ఐ డి. సులోచన, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ చారి కాన్స్టేబుల్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# మొదటి రోజు ప్రజాపాలన గ్రామసభలు విజయవంతం

**– హర్షం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 21 (తీన్మార్ న్యూస్): జిల్లాలో మొదటి రోజు ప్రజాపాలన గ్రామసభలు విజయవంతంగా నిర్వహించడం పట్ల జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మొదటిరోజు గ్రామసభలు నిర్వహణ, తదుపరి తేదీల్లో గ్రామసభలు నిర్వహణ తదితర అంశాలపై మండల, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, వ్యవసాయ, మున్సిపల్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితర అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథాకలకు లబ్ధిదారుల ఎంపికకై మొదటి రోజు నిర్వహించిన 72 గ్రామసభలు విజయవంతంగా నిర్వహించడం పట్ల భాగస్వాములైన యంత్రాంగాన్ని, పాల్గొన్న ప్రజలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగిలిన మూడు రోజులు ఇదే స్ఫూర్తితో గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. ముందస్తు రూపొందించిన గ్రామసభల షెడ్యూల్ ప్రకారం పక్కాగా నిర్వహించాలని సూచించారు. గ్రామ సభలు ప్రారంభానికి సందేశం చదివి వినిపించాలని ఆదేశించారు. గ్రామసభల్లో అర్హులైన వారి నుండి రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల దరఖాస్తులు స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ గ్రామసభలు నిర్వహణ ద్వారా అర్హులైన ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడానికి అవకాశం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. గ్రామ సభలకు ఇందిరమ్మ కమిటీ సభ్యులను ఆహ్వానించాలని సూచించారు. గ్రామసభలు నిర్వహణపై ఇక రోజు ముందు గానే టామ్ టామ్ ద్వారా విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. గ్రామసభలు నిర్వహణ సమాచారం ప్రతి ఒక్కరికీ తెలియాలని అన్నారు. ప్రతి ఒక్క గ్రామసభ విజయ వంతం కావాలని, ప్రజల సమక్షంలో అర్హుల జాభితా సిద్ధం చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చాలని ఆయన తెలిపారు. అర్హులు ఎవరూ మిస్ కాకుండా చూడాలని సూచించారు. అలాగే, మొదటి రోజు చూపిన ఉత్సాహంతో తదుపరి రోజులలో కూడా గ్రామసభలు దిగ్విజయంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, మండల, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, డిఆర్డీఓ నరేష్, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, గృహనిర్మాణ శాఖ పిడి లోకిలాల్, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడివోలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలందించాలి



**జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం**

సూర్యాపేట, జనవరి 21 (తీన్మార్ న్యూస్): గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం తెలిపారు. మంగళవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో తెలంగాణ పల్లె దావఖాన డాక్టర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 30 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికి ప్రతినెల బీపీ షుగర్ పరీక్షలు నిర్వహించాలని, అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలను ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ నాజియా, డాక్టర్లు శ్రీశైలం, నాగరాజు పల్లెదావఖాన అసోసియేషన్ సభ్యులు డాక్టర్ లు వీరేంద్రనాథ్, విజయ్, అనూష అమృత, అఖిల్, బిందు, రవీందర్ మౌనిక,మమత తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**– నిజమైన అర్హులకు సంక్షేమ ఫలాలను అందజేస్తాం**
**– జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు జిల్లా, జనవరి 21 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్ అన్నారు. మంగళవారం ములుగు మండలంలోని జీవింతరావుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్ తొ కలసి జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ ఇప్పటికే పలు పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం మరో నాలుగు పథకాలను ఈ నెల 26 నుండి అర్హులకు అందించడానికి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకాల కింద అర్హులను గుర్తించేందుకు వీలుగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించడం జరిగిందని కలెక్టర్ గుర్తు చేశారు. గ్రామ సభలు నిర్వహిస్తున్న సంబంధిత అధికారులు నిజమైన అర్హులను గుర్తించడానికి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. గ్రామసభల అనంతరం ఎంపిక చేసిన అర్హులపై ఎలాంటి అభ్యంతరాలను అధికారులకు తెలియజేయాలని, పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరమే సంబంధిత పథకాల అర్హులను ప్రకటించడం జరుగుతుందని స్పష్టం చేశారు. సాగు భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రెండు విడతల్లో సాలీనా 12 వేల రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. ఎలాంటి సాగు భూమి లేకుండా, 2023–24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు పని చేసిన కుటుంబాలను అర్హులుగా గుర్తించామన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్ర పరిశీలన జరిపి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులను నిర్ధారించామని తెలిపారు. ఆయా పథకాల కింద ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకోని వారితో పాటు, అర్హత కలిగి లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారి నుండి కూడా అర్జీలు స్వీకరించారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల కోసం అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. వాటిని సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు, అనవసర ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని అన్నారు. గ్రామ సభలలో దరఖాస్తులు అందజేయవచ్చని సూచించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా పరిశీలించి, అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని కలెక్టర్ భరోసా కల్పించారు. సంబంధిత అధికారులు నిర్వహిస్తున్న గ్రామ సభలకు ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి కొమురయ్య, ఎంపీ ఓ రహీం పంచాయితి కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభలలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్ జిల్లా, జనవరి 21 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా మంగళవారం జిల్లాలో ప్రారంభమైన ప్రజాపాలన గ్రామసభలు మహబూబాబాద్ మండలం సంద్రాల్ల గూడెం, బలరాం తండ గ్రామ పంచాయతీలలో జరిగే ప్రజాపాలన గ్రామసభలలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసా లబ్ధిదారుల జాబితాను గ్రామ సభల్లో విడుదల చేస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక అధికారుల బృందాలు ప్రజల నుండి సేకరిస్తూ నమోదు చేస్తున్న రిజిస్టర్లను పరిశీలించారు. అర్హులై ఉండి పేరు రాకపోతే మళ్లీ దరఖాస్తు చేసు కుంటే పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు. అర్హులైన వారు మండల కేంద్రాల్లో గాని కలెక్టరేట్లో కానీ తమపేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఎలాంటి అపోహలకు తావు లేకుండా లబ్ధిదారుల ఎంపిక జరుగు తుందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరికి పథకాలు అమలుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి జెడ్.పి.సీఈ ఓ పురుషోత్తం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలపై అవగాహన



మహబూబాబాద్ జిల్లా, జనవరి 21 (తీన్మార్ న్యూస్): రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా మంగళవారం మహబూబాబాద్ పట్టణంలోని పానిని విద్యాలయం స్కూల్ విద్యార్థులకు రోడ్ సేఫ్టీ భద్రత ట్రాఫిక్ నియమాలు పాటించవలసిన జాగ్రత్తలపై జిల్లా రవాణా శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, జీబ్రా క్రాసింగ్ లను వినియోగించాలని, ట్రాఫిక్ సిగ్నల్ అనుసరించాలని, వాహనాలను ఓవర్టేక్ చేయవద్దని, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, అధిక దూరం ప్రయాణించినప్పుడు విశ్రాంతి తీసుకోవడం, శీతాకాలం వర్షాకాలం లలో రోడ్డుపై ప్రయాణించే సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర అంశాలపై పిల్లలకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు, తేదీ జనవరి 1 నుండి 31, వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు బాధ్యతయూతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించా లని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్స్ ఎం.సాయి చరణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు

## దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి



దేవరకద్ర ప్రతినిధి,జనవరి21(తీన్మార్ న్యూస్) మహబూబ్ నగర్ జిల్లా అడ్డాకుల మండలం కందూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జనవరి 26 నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోయే 4 పథకాలు(ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా) విషయంలో ప్రజలు ఎవ్వరూ ఆందోళన చెందవద్దని అర్హులకు తప్పకుండా పథకాలను వర్తింపజేస్తామన్నారు.నేటి నుంచి గ్రామాల్లో గ్రామ సభలు,వార్డు సభలు నిర్వహిస్తున్నందున అర్హులు అక్కడకు వెళ్లి అధికారుల సమక్షంలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎవరికైనా అర్హత ఉండి ఇతర ప్రభుత్వ పథకాలు రాకపోతే గ్రామ సభలో అప్లికేషన్‌లు పెట్టుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటాలకు సిద్ధం కావాలి

- ఒకే దేశం..ఒకే ఎన్నికతో ప్రాంతీయ పార్టీలకు నష్టం
- లేబర్ కోడ్ విధానంపై పోరాటాలు నిర్వహించాలి
- కార్మిక కర్షక భవన్ ప్రజా సమస్యల పరిష్కారానికి నిలయం కావాలి : సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు
- సిద్దిపేటలో కార్మిక కర్షక భవనాన్ని ప్రారంభించిన బీవీ రాఘవులు, చుక్క రాములు

సిద్దిపేట అర్బన్: కేంద్ర, రాష్ట్ర విధానాల వల్ల ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రజాస్వామ్య పరిరక్షణకై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. సిద్దిపేటలో సీపీఐ(ఎం) కార్మిక కర్షక భవన్‌ను సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఒకే దేశం.. ఒకే ఎన్నిక.. విధానాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నదని, దీనివల్ల ప్రాంతీయ పార్టీలకు ముప్పు వాటిల్లుతుందని అన్నారు. ఇది తెలియని బీఆర్ఎస్ జమిలీ ఎన్నికలపై ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఎన్నో ఉద్యమాలు, త్యాగాలతో తెచ్చుకున్న లేబర్ చట్టాలను కుదించి నాలుగు చట్టాలు తీసుకు రావడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. వీటి అమలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో భవిష్యత్తులో రైతుల పరిస్థితి దయనీయంగా మారే అవకాశం ఉందన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం కోర్టుకు వెళ్తామని, నిరంతర పోరాటాలు నిర్వహి స్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాలనా వ్యవస్థ గాడి తప్పిందని, ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు దెబ్బతిని పోతున్నాయని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలను ప్రయివేటు పరం చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని దీనిపై ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలపై లైంగికదాడులు, దళితులు, మైనారిటీలపై అక్రమాలు పెరిగిపో తున్నాయని అన్నారు. సిద్దిపేటలో కార్మిక కర్షక భవన్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని, ఈ భవనం పేద ప్రజలు, రైతులు, కార్మిక వర్గానికి, అన్యాయానికి గురైన వారికి అండగా నిలబడాలని సూచించారు. సమస్య వస్తే కార్మిక కర్షక భవన్ వైపు చూసేలా పోరాటాలు నిర్వహించాలని తెలిపారు. సిద్దిపేటకు విచ్చేసిన బీవీ రాఘవులుకు సీపీఐ(ఎం) కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

# మల్టీలెవల్ మార్కెటింగ్ జోలికెళ్లొద్దు

- అత్యాశకు పోయి సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడొద్దు
- దీని వెనుక ఆర్థిక నష్టం జరిగే అవకాశం ఉంటుంది.
- పోలీసు చొరవతో జిల్లాలో రెండు కేసులు నమోదు.
- ఆన్లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి
- ఆర్థిక మోసాలపై వెంటనే 1930 కి పిర్యాదు చేయండి
- సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



సూర్యాపేట, జనవరి 21 (తీన్మార్ న్యూస్): గొలుసుకట్టు వ్యాపారాలు చేస్తూ ప్రజలను మోసం చేసే మల్టిలెవెల్ వ్యాపారాలు పెరుగుతున్నాయని, నిత్య సరుకులు, గృహోపకరణాలు, వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులు, క్రిప్టో కరెన్సీ మొదలగు వాటి పేర్లు చెప్పి ప్రజలను ఆర్థిక మోసాలకు గురిచేసే మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని మీ క్రింద ఎక్కువ మంది ఎజెంట్లను చేర్పించి తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు పొందండి అనే వాటిని నమ్మవద్దు అని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ అన్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ మల్టిలెవల్ వ్యాపారం చేస్తూ ప్రజల నుండి డబ్బులు సేకరించి ఆర్దికంగా మోసం చేసిన విషమై పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుని బాధితులను చైతన్య పరిచి ఫిర్యాదులు తీసుకుని జిల్లాలో రెండు కేసులు నమోదు చేశాం అని ఎస్పీ గుర్తుచేశారు. చైన్ సిస్టం మార్కెటింగ్ వ్యాపారాల ద్వారా ఆర్థికపరమైన మోసాలు జరుగుతున్నాయని ప్రజలు గుర్తించాలని కోరారు. ఎక్కువమంది ఏజెంట్లను చేర్పిస్తే రివార్డులు, పాయింట్లు లభిస్తాయని కేటుగాళ్లు ఆశ చూపుతారు. ఇలాంటి వారి మాయమాటలు నమ్మి అత్యాశకు పోతే భారీగా ఆర్థిక నష్టం జరుగుతుంది అన్నారు. సైబర్ మోసగాళ్ళు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెరగడంతో సైబర్ మోసగాళ్లు మల్టీలెవెల్ మార్కెటింగ్ పై దృష్టి సారించి గొలుసుకట్టు వ్యాపారాల పేరుతో వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్బుక్ లాంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రకటనలు చేసి అమాయకులను ఆకర్షించి మోసగించి ఆర్థిక నష్టాన్ని కలగజేస్తారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్ ను చాలామంది విదేశాల్లో ఉండి ఒక రాకెట్ లా నడుపుతారు భారీ లాభాలు తోపాటు లగ్జరీ కార్లు, ఫారిన్ టూర్ల పేరిట తమ ముఠాలతో అమాయకులకు వలపన్నుతారు అని ఎస్పీ తెలిపారు. అతి తక్కువ కాలంలో అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెప్తే అది మోసమని గ్రహించాలి, లేదంటే ప్రజల్ని మాయలోకి దింపి డబ్బులు కొల్లగొడతారు, అత్యాశకు పోతే మోసపోవడం ఖాయం. గొలుసుకట్టు మార్కెటింగ్ లో ముందుగా చేరిన వారికి లాభాలు వస్తాయి ఆ తర్వాత చేరిన వారంతా తీవ్రంగా నష్టపోవాల్సిందే. ఇలాంటి నెట్వర్క్ లో ఎవరు చేరొద్దు ఆయా సంస్థల నిర్వాహకులు, కంపెనీలు పెట్టే సభలు, సమావేశాలకు ఎవరు వెళ్ళవద్దు. సోషల్ మీడియాలో వచ్చే అబద్ధపు ప్రకటన పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని , అనుమానాస్పద ప్రకటనలు, వెబ్ లింకులు, ఏపీకె ఫైల్స్ లాంటివి డౌన్లోడ్ చేయవద్దన్నారు. మోసపూరిత ప్రకటనలపై, ఆర్థిక మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930, వాట్సప్ నెంబర్ 8712672222 ద్వారా ఫిర్యాదు చేయండి అని ఎస్పీ తెలిపారు.మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే నగదు తిరిగి పొందే అవకాశం ఉంటుందని,జిల్లా లో సైబర్ సెక్యూరిటీ సెల్ నిర్వహిస్తున్నమన్నారు. డీఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా సైబర్ సెక్యూరిటీ సిబ్బంది పని చేస్తున్నారు అని అన్నారు.

# తనిఖీలు సరే చర్యలేవి..!.

## సమయపాలన పాటించని వైద్యులు...

## నాణ్యమైన వైద్యం ఎండమావేనా..?

వరంగల్: శివుడి ఆజ్ఞ లేనిది చీమైనా కుట్టదు అన్న సామెత నిజమో అబద్ధమో తెలియదు గాని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పర్యవేక్షణ లేకపోవడంతో వరంగల్ జిల్లాలో నకిలీ వైద్యుల బాగోతాలు మూడు పువ్వులు ఆరు కాయలు వలె నడుస్తుంది అన్న విమర్శలు జిల్లాలో జోరుగా వినిపిస్తున్నాయి తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామీణ ప్రాంతాలలోని మారుమూల గ్రామాలకు చెందిన ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో చేస్తున్న ప్రణాళికలు క్షేత్రస్థాయిలో ఫలించటం లేదన్న అపోహ ప్రజల్లో నెలకొంది దానికి ప్రధానంగా జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా పనిచేస్తున్న అధికారి అండదండలతో ఈ తంతు సాగుతుందన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి వరంగల్ జిల్లాలో 14 మండలాలు ఉండగా ఆయా మండలాలలో నెలకొన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు సమయపాలన పాటించకపోవడం పై గ్రామాలలో మండలాలలో ప్రజలు పెదవిరుస్తున్నారు ఇటీవల జిల్లా ఆరోగ్యశాఖ అధికారి జిల్లాలోని కొన్ని మండలాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి సమయపాలన పాటించాలని ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని చేసిన సూచనలు ఎక్కడ అమలు కావటం లేదన్న అపవాదు ప్రజల్లో వినిపిస్తోంది కఠినమైన రీతిలో చర్యలు లేకపోవడంతో వైద్యాధికారి సూచనలను అధికారులతో పాటు ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది నిబంధనలను పాటించకపోవడంపై మండలాలలో తీవ్రమైన నిరసన వ్యక్తం అవుతుంది గతంతో పోలిస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తెలంగాణ ప్రభుత్వం ఎంతో పటిష్టవంతంగా బలవపేతం చేస్తున్న వైద్య సేవలు మాత్రం మునుపటి కంటే మెరుగన్న రీతిలో ఉండటం లేదన్న విమర్శలు జిల్లా వ్యాప్తంగా వినిపిస్తున్నాయి తనిఖీలు సర్వసాధారణంగా జరుగుతుంటాయి అన్న అభిప్రాయం కిందిస్థాయి సిబ్బందిలో ఉండటంతో వాటిని పాటించేవారు ఎక్కడా కనిపించడం లేదన్న అభిప్రాయం ప్రజల వ్యక్తం అవుతుంది వీటికి తోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉండే ఆరోగ్య ఉప కేంద్రాల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డ సందంగా తయారైందని ఆయా గ్రామాల ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు యధా రాజా తథా ప్రజా అన్న రీతిలో వరంగల్ జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఉన్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు

**తనిఖీలు సరే చర్యలేవి ?**

వరంగల్ జిల్లాలో నకిలీ వైద్యులు విచ్చలవిడిగా ఆస్పత్రులను నిర్వహిస్తుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు వైద్యం నారాయను హరి అన్నారు పెద్దలు కానీ వైద్యులు ఆసుపత్రికి వచ్చిన ప్రజలను ముక్కు పిండి వివిధ పరీక్షల పేరుతో జేబులు ఖాళీ చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి జిల్లాలో ఎవరు నిజమైన వైద్యులు కాదో తెలవక మోసపోయే పరిస్థితి జిల్లాలో నెలకొందని ప్రజలు అనుకుంటున్నారు వరంగల్ జిల్లాలో నకిలీ ఎంబిబిఎస్ లా జోరు కొనసాగుడుతుండడంతో నాణ్యమైన వైద్యం అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అన్న చర్చ కొనసాగుతోంది ఈ క్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ను తనిఖీ చేసి వస్తున్నారే కానీ నాణ్యమైన వైద్య సేవలో నిర్వాహలలో జరుగుతున్న లోపాలపై దృష్టి సారించడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు అదేవిధంగా జిల్లాలో నకిలీ ఎంబిబిఎస్ లో జోరుకు నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలకు వైద్యాధికారి ముందుకు రాకపోవడంతో వారు తీరుపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. అలాంటప్పుడు వరంగల్ జిల్లాలోని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు ఎక్కడ అందుతాయని ప్రజలు నిలదీస్తున్నారు వరంగల్ జిల్లాలోని నర్సంపేట నల్లబెల్లి జిల్లాలోని ఇతర మండలాలలో నకిలీ వైద్యాధికారుల జోరు కొనసాగుతుండడంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సరిగా స్పందించకపోవడం అధికారుల తీరు పట్ల ప్రజలు మండిపడుతున్నారు.

# కులగణన సర్వే ఆధారంగానే రేషన్ కార్డులు

కరీంనగర్: రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కులగణన సర్వే ఆధారంగా జారీ చేయనున్నారు. అయితే కులగణనలో ఖచ్చితత్వం ఎంత? అన్న దానిపైనే ఇప్పుడు అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇళ్లకు వచ్చి యజమానులు చెప్పిన వివరాల ఆధారంగానే నమోదు చేసుకుని సర్వే సిబ్బంది వెళ్లారు. అయితే ఇది ఖచ్చితమైన సమాచారం అనేది మాత్రం క్లారిటీ లేదు. కొందరు పొలాలు, ఆస్తులను దాచి ఉంచారన్న కామెంట్స్ కూడా వినిపించాయి. ప్రభుత్వ పథకాలు తమకు అందవన్న భయంతోనే ప్రజలు తమ ఆస్తుల విషయాన్ని బయటపెట్టలేదని కూడా వార్తలు వచ్చాయి. అదే సమయంలో సిబ్బంది కూడా తూతూమంత్రంగా చేసిన ఈ సర్వే ప్రాతిపదికన రేషన్ కార్డులు మంజూరు చేస్తే ఎలా? అన్న ప్రశ్న కూడా తలెత్తుతుంది. కులగణనలో అనేక ప్రశ్నలు వేశారు. యాభైకి పైగా ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడంలో సర్వే సిబ్బంది యాంత్రికంగానే వ్యవహరించారు. కనీసం వారి ఆదాయం గురించి కూడా ఆరా తీయలేదు. దీనివల్ల అనర్హులు ఎక్కువ మంది తెలుపు రంగు రేషన్ కార్డులు పొందే అవకాశముందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. రేషన్ కార్డుల జారీకి కులగణన సర్వే ప్రాతిపదిక కాకూడదు. దానికి నిబంధనలు వేరుగా ఉంటాయి. ఆదాయ పరిమితితో పాటు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారిని గుర్తించడానికి అనేక మార్గాలున్నాయి. ఇప్పుడు తెలంగాణ జరిగిన కులగణన వల్ల ఖచ్చితమైన సమాచారం వచ్చిందన్న నమ్మకం ఎవరికీ లేదు. మరి దాని ప్రాతిపదికన ఎలా రేషన్ కార్డులు మంజూరు చేస్తారన్న ప్రశ్నకు పాలకుల వద్ద సమాధానం లేదు.పాత రేషన్ కార్డులను కూడా తొలగించే ప్రసక్తి లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈనెల 26 నుంచి తెలంగాణలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ జరగనుంది. రేషన్‌కార్డుల ఫైనల్ లిస్ట్ ను దాదాపు అధికారులు సిద్ధం చేశారు. కులగణన సర్వే ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక చేస్తున్నట్లు కూడా ప్రకటించారు. కొత్తగా ఆరున్నర లక్షల రేషన్‌కార్డులు ప్రభుత్వం జారీ చేసే అవకాశముందని కూడా చెబుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తులను కూడా గ్రామసభలో నిర్ధారించి రేషన్‌కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయంతీసుకుందని చెబుతున్నారు. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని కూడా ప్రకటన చేసింది.అయితే అర్హులైన వారికి మాత్రమే ఇవ్వాలని, అనవసరంగా ప్రజాధనం దుర్వినియోగం చేసేలా కేవలం కులగణన సర్వేపై ఆధారపడవద్దన్న సూచనలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. మరి ఈ ప్రక్రియ సజావుగా సాగుతుందా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

**గ్రామ సభల్లో ఎంపిక**

ఈ నెల 26న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ ప్రారంభమవుతాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లాలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు నిష్పాక్షికంగా, పారదర్శకంగా అమలుచేస్తున్నామన్నారు. వ్యవసాయ భూములు ఉన్న ప్రతి రైతుకు ఎకరానికి రూ.12,000, భూమిలేని నిరుపేద రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.12,000 ఆర్థికసాయం అందజేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు.గ్రామసభలలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని, ఇందులో ఎలాంటి అనుమానాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. లబ్ధిదారుల జాబితా ఎక్కడో రూపొందించకుండా, గ్రామసభలలోనే ఖరారు చేస్తామన్నారు. ఎర్రుపాలెంలో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడతామన్నారు. చెరువులు, అడవులను రక్షిస్తూ ఎకో టూరిజం అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. జమలాపురం వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో అర్బన్ పార్క్ అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు.కొత్త రేషన్ కార్డులకు సంబంధించి ఇంకా ఎలాంటి జాబితాలు తయారు కాలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. లబ్దిదారుల జాబితా గ్రామాల్లోనే తయారవుతుందని పేర్కొన్నారు. ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడులో ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని భట్టి విక్రమార్క ప్రారభించారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు ఇస్తామని భట్టి హామీ ఇచ్చారు. గ్రామసభల్లోనే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ప్రజలందరి సమక్షంలోనే నిష్పక్షపాతంగా, పారదర్శకంగా రేషన్ కార్డుల లబ్ధిదారులను ఎంపిక చేస్తారని చెప్పారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గ్రామసభలలో నిష్పక్షపాతంగా ఎంపిక చేస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు.తెలంగాణలో మరోసారి రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రజాపాలన ద్వారా ప్రభుత్వం దరఖాస్తులను తీసుకున్నప్పటికీ? వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే ఇటీవలే నిర్వహించిన కుటుంబ సర్వే ఆధారంగా? రేషన్ కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించినట్లు సర్కార్ ప్రకటించింది. ఈ సర్వే ఆధారంగానే ప్రాథమిక జాబితాలను సిద్ధం చేసింది. వీటిని పౌరసరఫరాల శాఖ గ్రామాల వారీగా విభజించి విడుదల చేసింది.ప్రాథమిక జాబితాలు విడుదల కావటంతో గ్రామాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. చాలాసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ తమ పేర్లు లేదని పలువురు వాపోతున్నారు. తమకు అన్ని అర్హతలు ఉన్నాయని? అయినా తమ పేర్లు లేదని చెబుతున్నారు. కొత్త రేషన్ కార్డు జాబితాలు రావటంతో ప్రజల్లో అనేక అపోహాలు నెలకొన్నాయి. అయితే వీటిపై సర్కార్ క్లారిటీ ఇచ్చింది. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా ఉంటుందని స్పష్టం చేసింది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులను జారీ చేస్తామని చెప్పింది.

# షాద్ నగర్ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ

## ప్రమాణ స్వీకారోత్సవ సభ

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సంస్కృతిక శాఖల మంత్రి “జూపల్లి కృష్ణారావు”
- సమాజంలో సంస్కృతి సంప్రదాయాలు గాలికి పోయాయి
- సామాజిక మాధ్యమాలతో కుసంస్కారం
- కోట్లు వెచ్చించి విగ్రహాలు పెడుతున్నాం.. వారి ఆశయాలను వదిలేస్తున్నాం..
- విద్య, వైద్యానికి 80% నిధులు కేటాయించాలి
- గొప్ప చరిత్రకారుల విషయాలను సూచించే పుస్తకాలు అందుబాటులో ఉండాలి
- ప్రతి ఇంట్లో లైబ్రరీ ఉండాలి..
- షాద్ నగర్ గ్రంథాలయానికి రూ 5లక్షలు కేటాయించిన మంత్రి
- షాద్ నగర్ సభలో మంత్రి “జూపల్లి కృష్ణారావు” కీలక వ్యాఖ్యలు

సంస్కారం లేని జీవితం వ్యర్థమని, సమాజంలో చదువుకోకపోతే వినాశనం తప్పదని, గ్రంథాలయాలతో సమాజంలో నూతన మార్పు తీసుకురావచ్చని దానికి విద్య ఎంతో అవసరమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సంస్కృతిక శాఖల మంత్రి “జూపల్లి కృష్ణారావు” స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆహ్వానం మేరకు గ్రేడ్ వన్ శాఖ గ్రంథాలయ అభివృద్ధి నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సభకు మంత్రి జూపల్లి, ఎమ్మెల్సీ కోదండరామిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి స్థానిక మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్గా ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్ కే మదన్మోహన్ రెడ్డి తదితర పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సభను ఉద్దేశించి మంత్రి జూపల్లి కృష్ణారావు కీలక వ్యాఖ్యలు చేశారు. సమాజంలో గ్రంథాలయాల పాత్ర ఎంతో ముఖ్యమని మంత్రి అన్నారు. సమాజంలో ఎన్నో అవలక్షణాలు దుర్మార్గాలు నిత్యం చోటుచేసుకుంటున్న సమాచారాన్ని మీడియా ద్వారా తెలుసుకుంటున్నామని ఇది అత్యంత బాధాకరమని అన్నారు. దీనికి అన్నింటికీ కారణం చదువు లేకపోవడమే అని అన్నారు. విద్య వ్యాప్తి చెందితే సమాజం సుభిక్షంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. అందుకే తాను తన నియోజకవర్గంలో విద్యా వైద్యానికి 80% నిధులను కేటాయిస్తానని ఆ తర్వాతే మిగతా పనులను చూస్తానని స్పష్టం చేశారు. సంస్కారం లేని జీవితం విద్య రెండు వ్యర్థమని అన్నారు. చదువుతోపాటు సంస్కారం కూడా నేర్పించాలని సమాజానికి సూచించారు. సంస్కారం లేకుండా సమాజంలో సంస్కృతి సంప్రదాయాలు నిర్వీర్యం అయిపోయాయని అన్నారు. దీనికి ఫలితమే మనం రోజు మీడియాలో జరిగే దుర్మార్గాలు చదువుతున్నామని అన్నారు. వాట్సప్ ఫేస్బుక్ పలు సామాజిక మాధ్యమాలలో నిత్యం మంచి కన్నా చెడే ఎక్కువ ప్రభావితం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. సమాజంలో వేగవంతంగా మార్పు రావాలంటే విద్యను ప్రోత్సహించి గ్రామీణ ప్రాంతాలలో కూడా గ్రంథాలయాలు వెలిసేలా చూడాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటలైజేషన్ చేయడం గొప్ప పరిణామం దానికి ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందని అన్నారు. షాద్ నగర్ గ్రంథాలయానికి తన శాఖ తరపున 5 లక్షల రూపాయలు కేటాయిస్తున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. ధైర్యవంతులు, సాహసీలులు, పోరాటయోధులు, స్వతంత్ర సమరయోధులు, ఉద్యమకారుల చరిత్ర గురించి తెలిసే పుస్తకాలు సమాజంలో ఎక్కువగా రావాలని వాటిని చదవాలని సూచించారు. సమాజంలో చిన్న చిన్న విషయాలకు యువత అఘైత్యాలకు పాల్పడుతుందని గుర్తు చేశారు. దీనివల్ల చదువుల్లో ఫెయిల్ అయితే ఆత్మహత్యలు చేసుకోవడం ప్రేమ వికటిస్తే చౌకు పాల్పడడం, లేదా చంపడం లాంటి అవ లక్షణాలు సమాజంలో కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లు ఖర్చుపెట్టి మహాను భావుల విగ్రహాలు పెడుతున్నామని కానీ వారి ఆశయాలను మాత్రం పాటించడం లేదని విచారం వ్యక్తం చేశారు. సమాజంలో జీవన విధానం ప్రస్తుతం ధ్వంసం అవుతుందని దీని నుండి బయట పడాల్సిన అవసరం ఉందన్నారు. జీవితాన్ని మంచి ప్రణాళికల తో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. 90 శాతం మంది అప్పుల కొలిమిలో కూలిపోతున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సమాజంలో పౌరుల అలవాట్లు మారాల్సిన అవసరం ఉందన్నారు. ఆడంబరాలకు ఆర్భాటాలకు వెళ్లి ఆర్థిక విధ్వంసానికి గురికావుకూడదని అన్నారు. ప్రతి ఇంట్లో ఒక లైబ్రరీ ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

# ఏలాంటి అపోహాలు వద్దు..

- సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ..
- లోలం గ్రామసభలో కలెక్టర్ స్పష్టీకరణ..



డిచ్ పల్లి: సంక్షేమ పథకాలు అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, రాని వారు ఏలాంటి అపోహలు పడవద్దని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పష్టం చేశారు. మంగళవారం ఇందల్ వాయి మండలంలోని లోలం గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ నెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ పథకాల కింద అర్హులను గుర్తించేందుకు వీలుగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించడం జరిగిందని కలెక్టర్ గుర్తు చేశారు. ముఖ్యంగా సాగుకు యోగ్యమైన భూములను పక్కాగా నిర్ధారించామన్నారు. పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకు ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఎకరానికి 12 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తుందని తెలిపారు. అదేవిధంగా సాగు భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రెండు విడతల్లో సాలీనా రూ.12 వేల అందించడం జరుగుతుందన్నారు. ఎలాంటి సాగు భూమి లేకుండా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు పని చేసిన కుటుంబాలను అర్హులుగా గుర్తించామన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్ర పరిశీలన జరిపి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులను నిర్ధారించామని తెలిపారు. ఈ మేరకు వివిధ పథకాల ద్వారా అర్హులుగా గుర్తించబడిన వారి వివరాలను గ్రామ సభలో అందరి సమక్షంలో చదివి వినిపించారు.

ఎలాంటి అభ్యంతరాలు లేకుండా గ్రామ సభ వీటికి ఆమోదం తెలిపింది. ఆయా పథకాల కింద ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకోని వారితో పాటు, అర్హత కలిగి లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారి నుండి కూడా అర్జీలు స్వీకరించారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల కోసం అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. వాటిని సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు, అనవసర ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని అన్నారు. గ్రామ సభలలో దరఖాస్తులు అందజేయవచ్చని, వీలుపడని వారు ఈ నెల 26 తరువాత ఎప్పుడైనా మండల కార్యాలయాలు ,ప్రజా పాలన సేవా కేంద్రాలకు వెళ్లి సంబంధిత పత్రాలను జాతచేస్తూ దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా పరిశీలించి, అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు భరోసా కల్పించారు. గ్రామ సభలో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, మండల ప్రత్యేక అధికారి వీరాస్వామి, ఎంపిఓ రాజ్ కాంత్ రావు, డిప్యూటీ తహసిల్దార్ శైలజా,మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు మేకల సూవర్త, మాజీ సర్పంచ్ గుట్ట గంగాధర్, సర్కిల్ ఇన్స్పెక్టర్ కే మల్లేష్,ఎస్ హెచ్ ఓ మనోజ్ కుమార్, విస్తరణ అధికారి, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆర్థికంగా ఆర్టీసీ నిలదొక్కే యత్నం

హైదరాబాద్: తెలంగాణలో బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య బాగా పెరిగింది. దీంతో బస్టాండ్లు రద్దీగా మారుతున్నాయి. అటు మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. బస్టాండ్లు, బస్ డిపోలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. అందుకోసం భారీగా నిధులు కేటాయించింది.రాష్ట్రంలో పలు కొత్త బస్ డిపోలు, బస్ స్టేషన్ల నిర్మాణంబస్ స్టేషన్ల విస్తరణకు ఆర్టీసీ బోర్డు అనుమతి ఇచ్చింది. హైదరాబాద్ బస్ భవన్లోఆర్టీసీ బోర్డు సమావేశ మైంది. కొత్త డిపోలు, బస్ స్టేషన్లకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంది. రద్దీకి అనుగుణంగా బస్టాండ్లను అభివృద్ధిచేయాలని నిర్ణయించింది.

1.పెద్దపల్లి జిల్లా, పెద్దపల్లిలో కొత్త బస్ డిపో నిర్మాణం కోసం రూ.11.70 కోట్లు కేటాయిస్తూ బోర్డు అనుమతులు ఇచ్చింది.

2.ములుగు జిల్లా ఏటూరునాగారంలో కొత్త బస్ డిపో నిర్మాణం కోసం రూ.6.28 కోట్లు కేటాయిస్తూ అనుమతులు వచ్చాయి.

3.ములుగు జిల్లా ములుగులో కొత్త బస్ స్టేషన్ నిర్మాణం కోసం రూ. 5.11 కోట్లు కేటాయిస్తూ బోర్డు అనుమతులు ఇచ్చింది.

4.సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో కొత్త బస్ స్టేషన్ కోసం రూ. 3.75 కోట్లు కేటాయిస్తూ.. ఆర్టీసీ బోర్డు నిర్ణయం తీసుకుంది.

5.ఖమ్మం జిల్లా మధిరలో ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణం కోసం.. రూ.10.00 కోట్లు కేటాయించారు.

6. ములుగు జిల్లా మంగపేటలో కొత్త బస్ స్టేషన్ నిర్మాణానికి రూ. 51.00 లక్షలు కేటాయిస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది.

7.పెద్దపల్లి జిల్లా మంథని బస్ స్టేషన్ విస్తరణ కోసం రూ.95.00 లక్షలు కేటాయిస్తూ.. అనుమతులు వచ్చాయి.

8. సూర్యాపేట జిల్లా కోదాడ వద్ద ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణం కోసం.. రూ. 17.95 కోట్లు కేటాయిస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది.

9. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణం కోసం, రాబోయే సరస్వతి పుష్కరాల దృష్ట్యా.. ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణానికి రూ. 3.95 కోట్లు కేటాయిస్తూ ఆర్టీసీ బోర్డు అనుమతులు ఇచ్చింది. రాష్ట్రంలో కొత్త డిపోల ఏర్పాటుతో పాటు.. ప్రస్తుతమున్న 97 డిపోలు, బస్ స్టేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వ్యాఖ్యానించారు. మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగిందని.అందుకు అనుగుణంగా కొత్త బస్ స్టేషన్ల నిర్మాణంతో పాటు.ఉన్నవాటిని విస్తరిస్తామని స్పష్టం చేశారు.'రాష్ట్ర ప్రజలకు రవాణా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఒకవైపు కొత్త బస్సులను కొనుగోలు చేస్తున్నాం. అదే సమయంలో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాం.బోర్డు అనుమతి లభించిన నూతన డిపోలు, బస్ స్టేషన్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. దీనికి సంబంధించి ఇప్పటికే ఆర్టీసీ అధికారు లకు ఆదేశాలు ఇచ్చాం' అని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు.

# పెన్షనర్ల కు ఆదాయపు పన్ను రద్దు చేయాలి


### పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్.

కోరుట్ల: కేంద్రప్రభుత్వం పెన్షనర్లకు ఆదాయపు పన్ను రద్దు చేయాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు.పదవీ విరమణ చేసిన ఉద్యోగులను,ఉపాధ్యాయులను ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు చేయాలని,పాత పెన్షన్ పథకం పునరుద్ధరించాలని కోరుతూ తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ కోరుట్ల డివిజన్ శాఖ అధ్యక్షుడు పబ్బా శివానందం ఆధ్వర్యంలో కోరుట్ల డివిజన్, కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి మండల శాఖల పెన్షనర్స్ అసోసియేషన్ ల ప్రతినిధులు కోరుట్ల డివిజన్ ఆర్డీవో కార్యాలయ ఆవరణలో సమావేశమయ్యారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి,కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లకు పెన్షనర్లు పోస్ట్ కార్డులపై వినతులు రాసి ఆ కార్డులను ప్రదర్శిస్తూ ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలని ప్రధాన మంత్రిని, కేంద్ర ఆర్థికమంత్రిని కోరారు. ఆ తర్వాత పెన్షనర్స్ అందరూ పోస్ట్ అఫీసుకు వెళ్లి పోస్టల్ డబ్బాలో పోస్ట్ కార్డులు వేశారు.,2025-2026 కేంద్ర బడ్జెట్ 2025 ఫిబ్రవరి 1 న కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో ప్రవేశ పెట్టనున్న దృష్ట్యా,కొత్త ఆదాయపు పన్ను బిల్లును ప్రవేశ పెట్టనున్న దృష్ట్యా ప్రత్యేకంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ,,కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ లకు పోస్టుద్వారా పెన్షనర్లకు ఆదాయపు పన్ను రద్దు చేయాలని వినతులు పోస్టు కార్డులపై రాసి పోస్ట్ అఫిసు వద్ద ఉన్న పోస్టల్ డబ్బాలో వేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ గత ఎనిమిది ఏళ్లుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నాలు చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ఉండడం పై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 35 ఏళ్లుగా ప్రభుత్వంకు,ప్రజలకు సేవలందించిన పెన్షనర్స్ కు ఇచ్చే గౌరవభృతి పై ఆదాయపు పన్ను వసూలు చేయడం సరికాదన్నారు. ఫిబ్రవరి 1 న ప్రవేశ పెట్టనున్న కొత్త ఆదాయపు పన్ను చట్టము, 2025-2026 కేంద్ర బడ్జెట్ లో పెన్షనర్లకు ఆదాయపు పన్ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు..

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్,జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పి.సి.హన్మంత రెడ్డి, కార్యదర్శి బొల్లం విజయ్, కోశాధికారి గౌరి శెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షుడు వెల్మల ప్రకాష్ రావు, ఎం.డి.యాకూబ్, కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం,కార్యదర్శి గంటెడి రాజ్ మోహన్,కోశాధికారి నల్లాల లక్ష్మీనారాయణ,ఉపాధ్యక్షుడు ఎం.డి. సైఫోద్దీన్,సంయుక్త కార్యదర్శి టి.రాజయ్య, నాయకులు చిలుక గంగారాం, టి.స్వామి,రాజేశ్వర్,లక్ష్మికాంతం,మల్కయ్య,గోపాల్ ,శ్రీరాములు,సాబిత్ అలీ,నారాయణ, కోరుట్ల,మేడిపల్లి,కథలపూర్ మండలాల యూనిట్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇంటి యజమానికి మత్తు మందు ఇచ్చి సొత్తు

## కాజేసిన నిందుతులకు జైలు శిక్ష, జరిమానా



కామారెడ్డి: ఇంట్లో కిరాయి ఉన్నట్టుగా నటిస్తూ నమ్మించి ఇంటి యజమానికి మత్తు మందు ఇచ్చి సొత్తు కాజేసిన నిందుతులకు సోమవారం జైలు శిక్ష , జరిమానా (భర్తకు మూడు సంవత్సరాలు జైలు శిక్ష మరియు జరిమానా , బార్యకు 1 సంవత్సరం జైలు శిక్ష , జరిమానా) విధించినట్లు జిల్లా ఎస్పీ సింధు శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో నేరాలకు పాల్పడిన వారికీ శిక్షలు తప్పవు అన్నారు. తేదీ 01.10.2018 నా ఫిర్యాదు అయిన కళ్యాణి ఇంద్రమ్మ వయసు 60 సంవత్సరాలు గ్రామం ఎల్లారెడ్డి నివాసరాలు. వృద్ధులైన ఇంద్రమ్మ, కళ్యాణి శంకరయ్య భార్యభర్తలు ఇద్దరు కలిసి వారి ఇంట్లో నివాసం వుంటున్నారు. తేదీ: 24.9.2018 రోజున బట్టలు అమ్ముకునే వ్యక్తులగా నటించి నిందితులు ఇద్దరూ భార్యాభర్తలు వచ్చి ఇల్లు కిరాయికి కావాలని చెప్పి కిరాయి వున్నారు. ఒక వారం రోజుల తర్వాత నమ్మించి రెండు బాటిల్ల కల్లు తీసుకొని వచ్చి రాత్రి ఒక మత్తు మందు కలిపిన బాటిల్ ఇంటి యజమనికి ఇచ్చి ఇంకో బాటిల్ తీసుకొని వెళ్ళినారు . ఇంటి యజమానులు భార్యాభర్తలు ఇద్దరు అట్టి కాల్లు తాగి పడుకున్నారు. మరుసటి రోజు ఉదయం లేచి చూసే సరికి ఇంటి యజమాని అయిన కళ్యాణి శంకరయ్య నోటి నుండి నురుగు కారుతు చనిపోయి వున్నాడు, ఇంటి యజమాని బార్య అయిన కళ్యాణి ఇంద్రాయమ్మ మెడలో పుస్తెలతాడు, కమ్మలు దొంగలించబడినవి, బీరువా పగులగొట్టి డబ్బులు తీసునిపోయినారు. కొత్తగా కిరాయి వచ్చిన బార్యబర్తలు ఇద్దరు కూడా కనిపించలేరు. వీరిపై అనుమానం వచ్చి మృతుని బార్య ఫిర్యాది మేరకు ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించడం జరిగినది. ఈ దొంగతనం కేసు పరిశోధనలో భాగంగా గ్రామస్తులను, ఇతర గ్రామస్తులను విచారించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి గుంటూరు జిల్లా కు చెందిన గుంజి వెంకటేశం అలియాస్ గణేష్, గుంజి దివ్య అలియాస్ లక్ష్మి నేరస్తునిగా గుర్తించి అరెస్టు చేయడం జరిగిందన్నారు.

కేసులో సాక్షులను విచారించి, సాక్షాదారాలను పరిశీలించి దొంగలించిన విషయం రుజువు కావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సిహెచ్, వి ఆర్ ఆర్ వర ప్రసాద్ నిందుతునికి మూడు సంవత్సరాలు జైలు శిక్షతో పాటు 4000 , రూపాయల జరిమానా, బార్య అయిన గుంజి దివ్య అలియాస్ లక్ష్మికి 1 సంవత్సరం జైలు శిక్ష మరియు 4000, రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు ఇవ్వడం జరిగినదన్నారు. ఈ కేసును సరియగు పద్ధతిలో విచారణ చేసిన అప్పటి ఎల్లారెడ్డి సిఐ సుధాకర్, యస్ ఐ ఉపేందర్ రెడ్డి, ప్రసూత పోలీసు తరపున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్ గౌడ్, కోర్టు లో సాక్షులను ప్రవేశపెట్టిన ప్రస్తుత సిఐ రవీంద్ర నాయక్, ప్రస్తుత ఎస్ఐ మహేష్ , కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ టి. మురళి, కోర్ట్ కానిస్టేబుల్ సాయిలు లను అభినందించడం జరిగిందన్నారు.

# నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఫోకస్

వరంగల్: తెలంగాణలో కాంగ్రెస్ పాలన ఏడాది పూర్తి చేసుకుంది. అయితే క్షేత్రస్థాయిలోని చాలా మంది ముఖ్య నేతలు నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. కొంతమందికే అవకాశాలు దక్కగా? మరికొంత మంది నేతలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. వీలైనంత త్వరగా భర్తీ చేయాలని కోరుతున్నారు.తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి ఏడాది పూర్తైపోయింది. ఓవైపు సంక్షేమ పథకాలను పట్టాలెక్కించే పనిలో ఉంటూనే.. మరోవైపు రాజకీయంగానూ బలపడే అవకాశాలపై ఫోకస్ పెడుతూ వస్తోంది. బీఆర్ఎస్ నుంచి పది మంది ఎమ్మెల్యేలను కూడా చేర్చుకుంది. కట్ చేస్తే.. త్వరలోనే స్థానిక ఎన్నికల నగారా మోగనుంది. ఈ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో పాగా వేసి? గ్రౌండ్ లో మరింత బలపడాలని భావిస్తోంది.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పట్నుంచి? పార్టీలోని చాలా మంది నేతలు పదవులపై ఆశలు పెంచుకున్నారు. రేపు మాపు అంటూ భర్తీ ప్రకటనలు వస్తున్నప్పటికీ? ముహుర్తం మాత్రం ఖరారు కావటం లేదు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత? కొన్ని పదవులను భర్తీ చేశారు. అయితే ఇంకా చాలా కార్పొరేషన్లతో పాటు జిల్లా, నియోజకవర్గస్థాయిలో నామినేటెడ్ పదవులు ఉన్నాయి. అయితే పార్టీ కోసం పని చేసిన నేతలను గుర్తించి? పదవులను ఇవ్వాలని నేతలు కోరుతున్నారు. ఇదే విషయాన్ని పదే పదే అధినాయకత్వం దృష్టికి కూడా తీసుకెళ్తున్నారు. ఎవరికి వారుగా ప్రయత్నాలు చేస్తున్నారు.గతేడాది చివరల్లోనే పీసీసీ అధ్యక్షుడిగావ మహేశ్ కుమార్ గౌడ్ ను నియమించారు. ఆయన జిల్లాల్లో పర్యటనలు చేస్తున్నారు. పార్టీ బలోపేతం కోసం కీలక నిర్ణయాలు ఉంటాయని చెబుతున్నారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని పదే పదే స్పష్టం చేస్తున్నారు. కొత్త, పాత అనే తేడా లేకుండా? అందరూ కలిసి పని చేయాలని దిశానిర్దేశం చేస్తున్నారు. పని చేసిన వారికే గుర్తింపు ఉంటుందని చెప్పుకొస్తున్నారు.నామినేటెడ్ పదవులే కాదు? పార్టీ కార్యవర్గంలోనూ మార్పులు చేయనున్నారు. పార్టీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి? కొత్త నియామకాలను చేపట్టాలని టీపీసీసీ భావిస్తోంది. అయితే నామినేటెడ్ పదవులతో పాటే కార్యవర్గంలో కూడా మార్పులు చేసే విషయంపై అధినాయకత్వం ఆలోచిస్తున్నట్లు తెలిస్తోంది. ఇటీవలే మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్? ఈనెలాఖరా నాటికి నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని ఓ ప్రకటన కూడా చేశారు. అధినాయకత్వం గ్రీన్ సిగ్నల్ రాగానే?. ఈ ప్రక్రియ పట్టాలెక్కుతుందని చెప్పుకొచ్చారు. అటు ప్రభుత్వంలో ఇటు పార్టీలో పదవుల భర్తీ ఆలస్యం అవుతుండటంతో పార్టీలోని నేతలు పూర్తి నిరాశ నిస్పృహలో ఉన్నారన్న టాక్ వినిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే ముందే..నామినేటెడ్ పోస్టుల భర్తీని పూర్తి చేయాలని నేతలు కోరుతున్నారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో? రాష్ట్ర నాయకత్వం ఏం చేయబోతుందనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ టీపీసీసీ నిర్ణయం తీసుకున్నా? ఢిల్లీ నాయకత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తుదా..? లేక మరికొన్ని రోజులు ఆపుతుందా..? అనే విషయంలో కూడా క్లారిటీ రావాల్సి ఉంటుంది.పార్టీ పరంగా భర్తీ ప్రక్రియ ఆలస్యమవుతున్నప్పటికీ పదవులు ఆశిస్తున్న నేతలు? మాత్రం వెనక్కి తగ్గటం లేదు. ఎవరికి వారుగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కింది స్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు పావులు కదుపుతున్నారు. ఎలాగైనా పదవి దక్కించుకోవాలని? రాజకీయంగా బలపడాలని చూస్తున్నారు. ప్రస్తుతం ఆశల పల్లకిలో ఉన్న నేతల్లో ఎంత మందిని అదృష్టం వరిస్తుందో చూడాలి?!

# నిజమైన లబ్ధిదారులకు పథకాలు అందేలా పనిచేయాలి: రాజ్ కుమార్



పెద్దవూర: ప్రభుత్వం అందిస్తున్న 4 సంక్షేమ పథకాలు నిజ మైన లబ్ధిదారులకు అందేలా అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి రాజ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలం లోని బసిరెడ్డి పల్లి గ్రామం లో గ్రామ సభలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అందించనున్న నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథ కాలు ప్రతి పేదవాడి గడపకు అందేలా చూడాలని కోరారు. ఎంపిక ప్రక్రియలో రాజ కీయ నాయకుల ఒత్తిళ్లకు తలఒగ్గకుండా పారదర్శకంగా ఎంపిక ప్రక్రియజర గాలని ఆదేశించారు. రాజకీయాలు కుల, మతాలకతీతంగా ప్రతి నిరుపేదకు పథకం ద్వారా లబ్ధి చేకూరాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పక్కాగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుధీర్ కుమార్ కార్యదర్శి శ్యామ్ సుందర్ రెడ్డీ పంకజ్ రెడ్డీ, సిబ్బంది,అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

# మైలారం మైనింగ్‌పై ఉద్రిక్తత

- మైనింగ్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యుల అరెస్ట్
- నిరసనగా గ్రామస్తుల రాస్తారోకో
- రోడ్డుపై ముండ్ల కంపలు
- సొమ్మసిల్లిన మహిళ
- భారీగా పోలీసుల మోహరింపు
- మద్దతుగా బయలుదేరిన ప్రొ.హరగోపాల్, లక్ష్మణ్ అరెస్ట్




బల్మూరు: నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల పరిధిలోని మైలారం గుట్టపై మైనింగ్ తవ్వకాలపై ఉద్రిక్తత నెలకొంది. 'మా గ్రామాన్ని కాపాడుకుంటాం.. మైలారం గుట్టపై మైనింగ్ తవ్వకాలను అడ్డుకుంటాం.. అందుకు ఎంతటి ఆందోళన కార్యక్రమాలైనా చట్టపరిధిలో చేపడుతాం.." అంటూ మైలారం గుట్ట మైనింగ్ వ్యతిరేక పోరాట కమిటీ ప్రకటించింది. ఈ క్రమంలో శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టేందుకు సిద్ధమవ్వగా పోలీసులు ముందస్తుగా సోమవారం ఉదయమే కమిటీ నాయకులు, రైతులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీన్ని నిరసిస్తూ గ్రామస్తులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. రోడ్డుపై ముండ్ల కంప వేసి బైటాయించారు. గ్రామస్తులకు మద్దతుగా హైదరాబాద్ నుంచి బయలుదేరిన ప్రొఫెసర్లు హరగోపాల్, లక్ష్మణ్‌ను పోలీసులు మధ్యలో అడ్డుకుని అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. మైలారం గుట్టపై మైనింగ్ తవ్వకాలు చేపట్టరాదని గతంలో 2003-2004లో తీవ్రంగా వ్యతిరేకించా మని గ్రామస్తులు గుర్తు చేశారు. నాటి నుంచి కొంతకాలం సద్దుమణిగినా మళ్లీ ఐదారేండ్లుగా మైనింగ్‌ను తవ్వాలంటూ కాంట్రాక్టర్లు రావడంతో వారిని వ్యతిరేకిస్తూనే ఉన్నారు. మైనింగ్ తవ్వకాలను ఆపాలని అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీలు తీసుకున్నామని, కానీ మైనింగ్‌పై ఎలాంటి నిలిపివేత చర్యలు తీసుకోకపో వడంతో పార్లమెంటు ఎన్నికలను బహిష్కరించి, అప్పుడు రాస్తారోకో కూడా చేశారు. ప్రస్తుతం వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపేందుకు పోలీసు వారి అనుమతి కోరామని అయినప్పటికీ గ్రామంలో రాస్తారోకో నిర్వహించే సమయంలో ఉదయాన్నే గ్రామానికొచ్చి ముందస్తు అరెస్టులంటూ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని పలువురు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై ముండ్ల కంప వేసి బైటాయించారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లిన వారిని వెంటనే మా గ్రామానికి తీసుకొచ్చి తమకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు అనుమతి ఇచ్చినట్టే ఇచ్చి.. ముందస్తు అరెస్టులు చేస్తారా అంటూ ప్రశ్నించారు. సాయంత్రం వరకు అరెస్టు చేసిన వారిని పోలీసులు విడుదల చేయకపోవడంతో ఆందోళన కొనసాగించారు. అరెస్టు అయిన వారిలో గ్రామానికి చెందిన సుమిత్ర, పెద్ద లింగయ్య, చిన్న లింగయ్య, భాస్కర్ గౌడ్, సత్యం, వెంకటేశ్వర్లు ఉన్నారని గ్రామస్తులు తెలిపారు. ఉదయం నుంచి రాస్తారోకో నిర్వహించడంతో గ్రామానికి చెందిన శాంత అనే మహిళ స్పృహ తప్పి పడిపోయారు. దాంతో మైనింగ్ మా ప్రాణాలమీదకు వచ్చిందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న బీఎల్ఎఫ్ నాయకులు శ్రీశైలం, ఎంఎం గౌడ్ అక్కడికొచ్చి వారికి మద్దతు తెలిపారు. మైలారం గుట్ట మైనింగ్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపేందుకు ప్రొఫెసర్ హరగోపాల్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు లక్ష్మణ్ హైదరాబాద్ నుంచి బయలుదేరగా..వారిని వెల్దండ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. కాగా, అచ్చంపేట బల్మూరు ప్రధాన రహదారి నుంచి, మైలారం గేటు నుంచి గ్రామం వరకు భారీగా పోలీసులు మోహరించారు. కొత్తవారిని ఎవరినీ రానివ్వడం లేదు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

**- ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి**

జగిత్యాల, -అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి-లక్ష్మణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 14 వార్డు లో 60 లక్షలతో, 15 వ వార్డు లో 20 లక్షలతో,31 వార్డులలో 20 లక్షల నిధులతో మొత్తంగా 1 కోటి రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 14 వ వార్డులో ఎస్సి కమ్యూనిటీ హాల్ నూతన భవనాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ..అర్హతగల వారు రేషన్‌కార్డు కొరకు దరఖాస్తు కోవచ్చని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పట్టణంలో ఇంటింటి ఫీల్డ్ సర్వేయర్ వార్డు ఆఫీసర్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి జాబితా రూపొందించాలని తెలిపారు. అర్హతగల ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డు అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూజగిత్యాల పట్టణాభివృద్ధికి నిరంతర కృషి చేస్తున్నామని, జగిత్యాలను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు.ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధిని కాంక్షిస్తోందని, దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టారని, ముఖ్యమంత్రి గారి సహకారంతో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ గారి చొరవ చూపి జగిత్యాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరినాగభూషణం, కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్ లు కూతురు పద్మ (శేఖర్), తోట మల్లీకార్జున్, ఆజార్, బాలే శంకర్,ఏఈ శరణ్, కౌన్సిలర్ లు నాయకులు, ఆయా వార్డు ప్రజలు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద నివారణలో అందరూ భాగస్వాములు కావాలి

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- స్కూల్ బస్ డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను పాటించాలి
- జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్

జగిత్యాల: రోడ్డు ప్రమాదల నివారణలో అందరూ భాగస్వాములు కావాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు.రోడ్డు భద్రతా మాసోత్సవాలలో బాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న స్కూల్ వాహనాల ఫిట్‌నెస్,స్కూల్ బస్సులకు ఎలాంటి ప్రమాదాలకు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డ్రైవర్లకు ట్రాఫిక్, రోడ్ సేఫ్టీ పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లా లో రోడ్డు ప్రమాదల నివారనే లక్ష్యంగా స్కూల్స్ బస్ డ్రైవర్స్ కి ట్రాఫిక్, రోడ్ సేఫ్టీ పై అవగాహన ఉండాలన్నారు.చాలా వరకు జరిగిన రోడ్డు ప్రమాదాలలో అతివేగంగా నడపడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. స్కూల్ బస్సుల్లో ప్రయాణించే వారిలో చిన్న పిల్లలే ఉంటారు కాబట్టి వారి పట్ల చాలా జాగ్రత్త వహించాలని ఎస్పీ సూచించారు.స్కూల్ వాహనాలకు ఎలాంటి చిన్న ప్రమాదం జరిగిన సంబంధిత డ్రైవరు, యాజమాన్యం పై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పిల్లలని స్కూల్ కి తీసుకొని వచ్చేటప్పుడు, ఇంటికి తీసుకొని వెళ్లే క్రమంలో బస్సు హెల్పర్ వెనుక ముందు చూసుకొన్నాకనే వారిని దించాలనీ,పిల్లలు రోడ్డు దాటవలసివస్తే హెల్పర్ తప్పక దాటించాలని సూచించారు. బస్ కి సంబంధించి అన్ని వాహన పత్రాలు కల్గివుండాలని, బస్సు సరైన కండిషన్ లో ఉందో లేదో చెక్ చూసుకోవాలని సూచించారు. మద్యం తాగి ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రైవ్ చేయకూడదని సూచించారు. ఎన్నో కుటుంబాలు బస్సు డ్రైవర్ల మీద చాలా నమ్మకంతో తమతమ పిల్లలని స్కూల్స్ కి బస్సుల్లో పంపిస్తున్నారని వారి నమ్మకాన్ని వమ్ము చేయొద్దని తెలిపారు.ఎవరైనా ట్రాఫిక్ నియమనిబంధనలు పాటించక పోతే వారిపై చట్టపరమైన చర్యలు చేసుకోవడం జరుగుతుందని డీటీఓ శ్రీనివాస్ తెలిపారు. జిల్లా లో నిబంధనలు పాటించని స్కూల్ బస్సులపై పోలీస్ , ఆర్టీఏ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ నిబంధనలు పాటించని బస్సులను సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ పలు స్కూల్ వాహనాల యొక్క ఫిట్నెస్ సర్టిఫికెట్లు, ప్రమాణాలు పాటిస్తున్నారు లేదా అని స్వయంగా పరిశీలించి పాటించని వాహనాలపై తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల డిఎస్పి రఘు చంధర్,శ్రీనివాస్,రిజర్వ్ ఇన్స్పెక్టర్ వేణు, ఎస్సైలు సుధాకర్, మల్లేశం, గీత, రవాణా శాఖ అధికారులు, ట్రాస్మా జిల్లా అధ్యక్షులు శ్రీధర్ రావు,పోలీస్ సిబ్బంది , స్కూల్ బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

# బ్యాంకులు, ఎటిఎంల వద్ద పటిష్టమైన భద్రతా ప్రమాణాలు పాటించాలి

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

జగిత్యాల: ప్రతి బ్యాంక్ ఏటీఎం వద్ద తప్పనిసరిగా సెక్యూరిటీ గార్డు, సిసి కెమెరాలు, అలారం సిస్టం ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ బ్యాంకుల్లో పని చేస్తున్న బ్యాంకు అధికారులతో బ్యాంకుల, ఏటీఎంల వద్ద భద్రతా ప్రమాణాలు, సిసి కెమెరాల ఏర్పాటు, ఆర్థిక నేరాలు, గతంలో జరిగిన బ్యాంకు, ఏటీఎం సంబందించిన నేరాల గురించి, భవిష్యత్తు లో తీసుకోవలసిన భద్రత ఏర్పాట్లు, తీసుకోవలసిన జాగ్రత్తలపై, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లా పరిధి లొ పె 129 బ్యాంకులు, సుమారు 90 ఏటీఎం సెంటర్స్ లను గుర్తించడం జరిగిందని అన్నారు. బ్యాంకులు, ఎటిఎంల వద్ద పాటించాల్సిన భద్రతా ప్రమాణాలు బ్యాంకుల వద్ద భద్రతా ప్రమాణాలు తూచ తప్పకుండా పాటించాలని,ఏటీఎం కేంద్రాల వద్ద కచ్చితంగా గార్డును నియమించాలని సూచించారు. ప్రతి బ్యాంకు, ఏటీఎం ల వద్ద నిరంతరం సెక్యూరిటీ గార్డు,సిసి కెమెరాలు, అలారం సిస్టం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దాదాపు బ్యాంకులు, ఏటీఎంలలో అధిక నాణ్యత లేని సీసీ కెమెరాలు ఉన్నాయని, చాలా బ్యాంకుల వద్ద సెక్యూరిటీ గార్డులు లేరని ఈ సమావేశం అనంతరం అన్ని ఎటిఎంలలో, బ్యాంకులలో అలారం సిస్టమ్‌లతో పాటు సిసిటివి కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు.బ్యాంక్, ఏటీఎం ల వద్ద ఏదైనా అనుకోని సంఘటన జరిగిన సమయంలో సిబ్బంది ఎలా ప్రతిస్పందించాలో దాని పై ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. లోపలికి వచ్చే వ్యక్తులను తనిఖీ చేయడానికి గార్డు ను బ్యాంకు ప్రవేశ ద్వారం నియమించాలని సూచించారు.సెక్యూరిటీ గార్డును బ్యాంక్ లేదా సెక్యూరిటీ ఏజెన్సీ నియమించినప్పటికీ, అతని వ్యక్తిగత సమాచారం యొక్క పూర్తి రికార్డు, అతని ఫోటోతో పాటు, బ్యాంక్ వద్ద ఉంచాలని సూచించారు. కొత్తగా నియమితులైన వారు లేదా తాత్కాలిక ప్రాతిపదికన నియమించబడిన వారి పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చాలా నేరాలలో నిందితులు సీసీటీవీ లపై స్ప్రే చేసి సిసిటివిలు పని చేకుండా చేసి దొంగాతలకు పాల్పడుతారు అదేవిధంగా డీవీఆర్ లను దొంగిలించి నాశనం చేయడం చేస్తారు కావున డీవీఆర్ లను కనిపించేలాగా కాకుండా సీక్రెట్ ప్రాంతాలలో ఉంచాలని సూచించారు.ఏటీఎం లలో డబ్బులు ఫీల్లింగ్ సమయంలో స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం ఇస్తే ఆ ప్రాంతంలోని బ్లూ క్లోట్స్, పెట్రో కార్ సిబ్బందిని అప్రమత్తం చేయడం జరుగుతుందన్నారు. ప్రతి బ్యాంకు అధికారులకు, సిబ్బందికి బ్యాంకు ఉన్న ప్రాంత పోలీస్ స్టేషన్ అధికారుల నెంబర్ లు తెలిసి ఉండాలి. హెల్ప్‌లైన్ మరియు పోలీస్ స్టేషన్‌ల సంప్రదింపు నంబర్‌లను బోల్డ్ అక్షరాలతో వ్రాసి బ్యాంకు లోపల తగిన ప్రదేశాలలో ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటివరకు, దొంగలు ఎక్కువగా బ్యాంకులు రోజు తెరిచినప్పుడు లేదా మూసివేయబడిన సమయంలో మరియు వారి భోజన విరామ సమయంలో కూడా లక్ష్యంగా చేసుకున్నారు. కాబట్టి ఈ సమయంలో సెక్యూరిటీ గార్డుతో పాటు బ్యాంకు ఉద్యోగులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా ప్రమాదకరమైన సంఘటన జరిగినప్పుడు డయల్ 100 కు ,స్థానిక పోలీస్ కి సమాచారం అందించాలని అన్నారు.బ్యాంకుల నుండి బంగారం ,డబ్బులు డ్రా చేసుకొని వెళ్ళే వాళ్ళను లక్ష్యంగా చేసుకుని, వారిని అనుసరించి దొంగతనలు చేస్తున్నారని వీటిని నివారించడానికి బ్యాంకు బయట వాహనాలు నిలిపే ప్రాంతాలలో కూడా సిసి కెమరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాత్రి సమయం లో కూడా సెక్యూరిటీ గార్డ్స్ లను ఆకస్మికంగా వారి పనితీరు ను తనిఖీ చేయాలని బ్యాంకు మేనేజర్లకు సూచించారు.ఈ సమావేశంలో డిఎస్పీ రఘు చందర్,ఎస్బీ ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు

# పేదలకు అండ..ఎర్రజెండా..!

- కుండిషేకుగూడకు నీళ్లొచ్చాయి..
- కోయపోచగూడెంకు భూమి దక్కింది
- రద్దయిన తునికాకు టెండర్లకు మళ్లీ మోక్షం
- సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణకు పోరాటం
- ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా సాగిన ఉద్యమాలు



ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లాలో గిరిజనం ఎదుర్కొంటున్న బాధలను కళ్లారా చూసిన పార్టీ నాయకులు వాటి పరిష్కారానికి నడుం బిగించారు. జిల్లాలోని మారుమూల గాదిగూడ మండలం కుండిషేకుగూడ వాసులు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. కనీసం తాగేందుకు నీళ్లు కూడా లేని పరిస్థితి. ఈ దుస్థితిని ప్రత్యక్షంగా చూసిన పార్టీ నాయకత్వం వారితో కలిసి 52 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టింది. కుండిషేకుగూడ నుంచి జిల్లా కేంద్రానికి కాలినడకన పార్టీ నాయకత్వంతో కలిసి పిల్లాపాపలతో వచ్చిన గిరిజనులు తొమ్మిది రోజుల పాటు కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఐటీడీఏ అధికారులు స్పందించి గ్రామంలో బోర్లు వేయించి మోటార్లు బిగించడంతో పాటు నీటి ట్యాంకు బాగు చేయించడంతో ఆ ఊరి తాగునీటి కష్టాలు దూరమయ్యాయి. మూతపడిన సీసీఐ పరిశ్రమను పునరుద్ధరించాలని నిరసన చేపడుతూ ఉద్యమం చేపట్టారు. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆ పరిశ్రమను సందర్శించి పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కోయపోచగూడెంలో పోడు భూముల కోసం ఆదివాసులకు అండగా మూడు నెలలు పోరాటం సాగించింది. ఈ క్రమంలో 8మంది మహిళలను నిర్బంధించగా.. 40మందిపై అక్రమ కేసులు పెట్టింది. పార్టీ పోరాటం ఫలితంగా 150 ఎకరాల సాగు భూమి ఆదివాసులకు దక్కింది. అన్నారం- మేడిగడ్డ బ్యారేజీ ముంపు కారణంగా మంచిర్యాల పట్టణాన్ని వరద ముంచెత్తింది. కరకట్ట నిర్మాణం చేపట్టాలని పార్టీ చేపట్టిన పోరాటం కారణంగా ప్రభుత్వం రూ.200కోట్లు మంజూరు చేసింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో అటవీశాఖ అధికారులు తునికాకు టెండర్లను రద్దు చేశారు. దాంతో పార్టీ పోరాటం చేపట్టగా అధికారులు దిగివచ్చి 15యూనిట్లు తెరిచి టెండర్లు పిలవడంతో తునికాకు సేకరించేవారికి ప్రయోజనం కలిగింది. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం కనకాపూర్‌కు చెందిన ఓ దళిత రైతుకు చెందిన ఐదు ఎకరాల భూమిని అబ్దుల్లాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ) గుంజుకొని అందులో ఒక బిల్డింగ్ నిర్మించి క్రికెట్ గ్రౌండ్‌ను నిర్మించింది. దాంతో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బాధిత రైతుకు అండగా నిలిచి పోరాటం చేపట్టింది. ఆ భూమిని స్వాధీనం చేసుకొని సదరు భవనంలో రైతుతో గృహ ప్రవేశం చేయించింది. 17మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేయించింది. బాధితుడికి భూమి దక్కేలా చూస్తామని కలెక్టర్ హామీనిచ్చారు. భూమికి బదులు భూమిని అప్పగించాలని సదరు రైతు కోరుకోవడంతో ప్రస్తుతం ఈ అంశం కోర్టు పరిధిలో ఉంది. ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి పోరాటాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేకం జరిగాయి. వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న బాధితులకు పార్టీ సాంత్వన కలిగించింది.

# అధికారం కోల్పోగానే ప్రోటోకాల్ గుర్తొచ్చిందా ?

**బీజేపీ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సాంబారి కళావతి...**

జగిత్యాల: నిజామాబాద్ జిల్లా కేంద్రంగా సంక్రాతి కానుకగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభోత్సవానికి స్థానిక శాసనసభ్యులకు కనీస సమాచారం ఇవ్వలేదని ప్రోటోకాల్ పాటించలేదని ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుందని బిజెపి మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబారి కళావతి ఒక ప్రకటనలో విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పథకాల ప్రారంభోత్సవాలకు శంకుస్థాపనలకు కరీంనగర్, నిజామాబాద్ బీజేపీ ఎంపీలకు కనీస సమాచారం ఇవ్వకుండా శిలాఫలకాల మీద పేర్లు కూడా రాయకుండ ప్రోటోకాల్ పాటించలేదని ఈవిషయంపై వివరణ కోరితే అధికారుల తప్పిదం అని దాటవేసిన మాటలు ఒక్కసారి గుర్తు చేసుకోవాలని పైగా వారి వాహనాల మీద బిఆరెస్ కార్యకర్తలు దాడి చేస్తే కనీసం ఖండించలేదని అన్నారు. ప్రధానమంత్రి హోదాలో పలు పథకాల ప్రారంభోత్సవానికి నరేంద్ర మోడీ తెలంగాణాకు వస్తే ఏరోజు ముఖ్యమంత్రి హోదాలో కెసిఆర్ ప్రోటోకాల్ పాటించలేదన్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు అహంకార ధోరణితో వేదికల మీద ప్రోటోకాల్ పాటించకుండ మంత్రులను సైతం తోసిపుచ్చిన రోజులు ఉన్నాయని అన్నారు.బీజేపీ పార్టీ ఎక్కడ అధికారంలో ఉన్న రాజ్యాంగాన్ని గౌరవిస్తూ రాజ్యాంగానికి లోబడి నైతిక విలువలకు కట్టుబడి ప్రోటోకాల్ పాటిస్తుందని ఒకవేళ పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభోత్సవం రోజున ప్రోటోకాల్ లేనట్లయితే అది ముమ్మాటికి అధికారుల తప్పిదమే అన్నారు.

# కాళేశ్వరం జోన్ పరిధి పోలీసులకు క్రీడలు

- క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం..
- రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో కూడా రాణించి మంచిపేరు తీసుకురావాలి:
- అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు
- జవహర్లాల్ నెహ్రూ క్రీడా మైదానంలో సందడి..

గోదావరిఖని: తెలంగాణ రాష్ట్ర స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ పోటీలు కోసం క్రీడాకారుల ఎంపికకై కాళేశ్వరం జోన్ స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ పోటీలు పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రూ మైదానంలో ఈరోజు రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్., ఐజీ ఆదేశాల మేరకు అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు పోలీస్ అధికారులతో కలిసి ఘనంగా క్రీడలను ప్రారంభించారు. అడ్మిన్ డీసిపి మాట్లాడుతూ.... పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం 24 చీ 7 విధినిర్వహణలో బిజీగా ఉన్నప్పటికీ సిబ్బంది క్రీడల్లో పాల్గొనడం వారిలో నూతనోత్సాహాన్ని నింపుతుందన్నారు. ఆటల్లో గెలుపోటములనేవి సహజమన్నారు. గెలుపోటముల కంటే టీమ్ స్పిరిట్ గొప్పదన్నారు. క్రీడల్లో గెలుపు కంటే పాల్గొనడం/ పార్టిసిపేషన్ ముఖ్యమన్నారు. ఎల్లప్పుడు విధినిర్వహణలో ఉంటారని, అలాంటి నిర్విరామ విధులలో ఉన్న పోలీసులకు స్పోర్ట్స్ మరియు గేమ్స్ అనేవి నూతన ఉత్సాహంతో పాటు ఉల్లాసాన్ని కలిగిస్తుందని, సిబ్బందికి ఎల్లప్పుడు పని ఒత్తిడి తట్టుకోవడానికి, శక్తిని ఇవ్వడానికి ఈ క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయని ఈ క్రీడలు స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించు కోవాలని గెలుపోటములను ఏదైనా స్పూర్తిగా తీసుకోవాలని ఇక్కడ ఉత్తమ ప్రతిభ కనబరిచి కాళేశ్వరం జోన్ తరుపున రాష్ట్ర స్థాయిపోటీలలో పాల్గొని అక్కడ కూడా కాళేశ్వరం జోన్ కు అత్యధిక పతకాలు సాధించి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

ఈ పోటీలు రామగుండం పోలీస్ కమిషనరేట్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల పోలీస్ టీమ్స్ మధ్య షటిల్ బ్యాట్మెంటన్, వాలీబాల్,కబడ్డీ, ఖో ఖో, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, స్విమ్మింగ్, తగ్గాఫర్, హై జంప్, లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో, జవలిన్ మరియు అథెలిటిక్స్ క్రీడలు లలో సెలక్షన్ లు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, ఏ ఆర్ ఏసీపీ లు ప్రతాప్, సుందర్ రావు, ఆర్ఐ లు దామోదర్, శ్రీనివాస్, వామన మూర్తి, మల్లేశం, సంపత్, ములుగు ఆర్ఐ సంతోష్ కుమార్, తదితరులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్వే పారదర్శకంగా చేపట్టాలి

కరీంనగర్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న ఇందిరమ్మ ఇళ్లు రైతు భరోసా నూతన రేషన్ కార్డులు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కోసం లబ్ధిదారుల ఎంపిక సర్వే పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. రామడుగు మండలం వెదిర గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, గోపాల్ రావు పేట గ్రామ శివారులో జరిగిన క్షేత్రస్థాయి సర్వేను కలెక్టర్ పమేలా సత్పతి అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా సర్వే వివరాలు నమోదు చేయాలన్నారు. రేషన్ కార్డుల జారీకి సంబంధించి కుటుంబ ఆర్థిక స్థితిగతులను పరిగణన లోకి తీసుకోవాలన్నారు. రైతుభరోసా కింద కేవలం సాగు భూముల వివరాలనే నమోదు చేయాలన్నారు. నిర్మాణాలు ఉన్న స్థలాలు, కోళ్ల ఫామ్, రైస్ మిల్లులు లాంటి పరిశ్రమలు ఉన్న స్థలాల వివరాలు నమోదు చేయొద్దని వివరించారు. ఇందిరా ఆత్మీయ భరోసా పథకం కోసం 2023-24 లో కనీసం 20 రోజులు ఉపాధి పని చేసిన భూమి లేని కూలీలనే ఎంపిక చేయాలన్నారు.ఇందిరమ్మ ఇళ్ల కోసం అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, చొప్పదండి ఏడిఏ ప్రియదర్శిని, తహసీల్దార్ రామలక్ష్మి, ఏవో త్రివేదిక తదితరులు ఉన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ నిందితులకు చుక్కలే

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసుపై తెలంగాణ పోలీసులు సీరియస్‌గా దృష్టిపెట్టారు. అమెరికా ఉన్న నిందితులను ఎలాగైనా ఇండియాకు రప్పించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా నిందితులు ఏదో ఒక రూపంలో తప్పించుకుంటు న్నారు. ఈ క్రమంలో సరికొత్త అస్త్రాన్ని ప్రయోగించారు. దీనికి సంబంధించి ఇప్పటికే కేంద్ర హోంశాఖకు నివేదిక వెళ్లినట్టు సమాచారం.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిపైనే గడిచింది. తొలుత ఫోన్ ట్యాపింగ్ పై దృష్టి సారించారు పోలీసులు. ఈ క్రమంలో చాలామందిని అరెస్ట్ చేశారు. ఇప్పటికే పలువురు రిమాండ్‌లో ఉన్నారు. కేసు నమోదు తర్వాత అమెరికాకు వెళ్లిపోయారు కీలక నిందితులు ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావు. వారిని రప్పించేందుకు పోలీసులు చేయని ప్రయత్నాలు లేవు. ఎప్పటికప్పుడు తిప్పుకొడుతూ వస్తున్నారు నిందితులు.పోలీసు వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు.. అమెరికాలో ఉన్న ఇద్దరు నిందితులు ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావులపై ఎక్స్‌ట్రడిషన్ అస్త్రాన్ని ప్రయోగించాలని నిర్ణయించుకున్నారట పోలీసులు. కరుడుగట్టిన నేరస్తులను అప్పగించే విషయంలో భారత్-అమెరికా మధ్య ఉన్న ఒప్పందాన్ని తెరపై తెచ్చారు.ఈ క్రమంలో సీఐడీ ద్వారా కేంద్ర హోంశాఖకు నివేదిక సైతం ఇచ్చినట్టు తెలుస్తోంది. అక్కడి నుంచి విదేశాంగ శాఖ ద్వారా అమెరికాకు నివేదిక వెళ్లాల్సివుంది. అమెరికా ప్రభుత్వం దీన్ని పరిగణనలోకి తీసుకుంటే కచ్చితంగా ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితులు భారత్ రావడం ఖాయమన్నమాట.ఇద్దరు నిందితులపై రెడ్ కార్నర్ నోటీసు జారీ చేశారు తెలంగాణ పోలీసులు. విదేశీ వ్యవహారాల శాఖ ద్వారా ఇంటర్ పోల్‌కు సమాచారం పంపించారు. దీనిపై నిందితులు విదేశీ వ్యవహారాల శాఖలో అప్పీల్ చేశారు. ఓ వైపు ఈ తతంగం జరుగుతుండగా నేరస్తుల అప్పగింత ఒప్పందాన్ని తెరపైకి తెచ్చారు పోలీసులు.నిందితులు ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావులు అమెరికాలో అక్రమ వలసదారులుగా నివాసం ఉన్నారు. తమను రాజకీయ శరణార్థిగా గుర్తించాలని మూడు నెలల కిందట ప్రభాకర్ రావు అమెరికా ప్రభుత్వానికి దరఖాస్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఆ అంశం అక్కడి ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందిమంగళవారం నుంచి అమెరికాలో ట్రంప్ సర్కార్ అధికారంలోకి రానుంది. ఈ నేపథ్యంలో నిందితులు అప్పగింత సునాయాశమవుతుందని ఆలోచన చేస్తున్నారు పోలీసులు. ఈ వ్యవహారం వీలైనంత త్వరగా జరిగితే, నిందితులు చిక్కడం ఖాయమని అంటున్నారు. వాళ్లు వస్తే.. తెరవెనుక సూత్రధారులు ఎవరన్నది తేలిపోనుంది. ఆపై కేసుకు ఓ ముగింపు రానుంది.

# 10 నెలల నుంచి తెరుచుకోని కే హబ్ తాళాలు

వరంగల్: కాకతీయ యూనివర్సిటీలో పరిశోధనలను ప్రోత్సహించాలని సంకల్పించారు. వివిధ ఆవిష్కరణలకు ఉపయోగపడేందుకు 'కెహబ్'ను ఏర్పాటు చేశారు. కానీ.. అది ఇంతవరకు తెరచుకోవడం లేదు. ఫలితంగా కోట్లాది రూపాయలు వృథా అవుతున్నాయి.కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్(రూసా) ఫండ్స్ రూ.50 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో కాకతీయ యూనివర్సిటీలో కె-హబ్‌ను నిర్మించారు. దాదాపు ఏడాదిన్నర కిందటే పనులన్నీ పూర్తయ్యాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దీనిని ప్రారంభించడంలో నిర్లక్ష్యం చూపింది. గవర్నమెంట్ మారిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, స్థానిక నేతలంతా కలిసి ఆర్భాటంగా 'కె?హబ్'ను ప్రారంభించారు.దానిని ప్రారంభించి పది నెలలవుతున్నా కాకతీయ యూనివర్సిటీ అధికారులు ఇంతవరకు దాని తాళాలు తీసిన పాపాన పోలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి 'కె?హబ్' నిర్మాణం, అందులో పరికరాల కోసం రూసా ఫండ్స్ రూ.50 కోట్లు రిలీజ్ అయ్యాయి. కానీ పరిశోధనలను ముందుకు తీసుకెళ్లడానికి యూనివర్సిటీ అధికారులు చొరవ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నెలలు గడుస్తున్నా ఆవిష్కరణల వైపు అడుగులు వేయడం లేదు. తాళాలతోనే దర్శనమిస్తోందిరూసా ఫండ్స్‌తో 'కె?హబ్' నిర్వహణకు సొంత భవనం, ప్రాజెక్టులకు సంబంధించిన పరిశోధన కేంద్రాలు, మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. ఇందుకు మొదట విడతగా 2020లోనే రూసా రూ.15 కోట్లు విడుదల చేసింది. దీంతో తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.6 కోట్లతో 'కె?హబ్' బిల్డింగ్ పనులు చేపట్టారు. 2022లోనే పనులు పూర్తయ్యాయి. కానీ అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్దగా పట్టించుకోకక కె?హబ్ ఓపెనింగ్‌కు నోచుకోలేదు.గత ప్రభుత్వం పట్టించుకోకపోవడం, విద్యార్థులు పరిశోధనలకు దూరమవుతుండటంతో.. సమస్యను ఇక్కడి విద్యార్థి సంఘాల నేతలు కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కె?హబ్ లో ఇంటర్నల్ వర్క్స్ అన్నీ పూర్తి చేశారు. ఆ తరువాత 2024 మార్చి 10వ తేదీన వరంగల్ నగర పర్యటనకు వచ్చిన పొంగులేటి, కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఇతర నేతలంతా కలిసి 'కెహబ్'ను ప్రాంభించారు. అనంతరం వర్సిటీ అధికారులు కెహబ్‌కు తాళాలు వేసి పెట్టారు. కెహబ్ ఏర్పాటు కోసం రూసా ఫండ్స్ రూ.50 కోట్లు రిలీజ్ చేయగా.. అందులో రూ.6 కోట్లతో బిల్డింగ్, రూ.9 కోట్లను మౌలిక వసతుల కల్పనకు కేటాయించారు. రూ.23 కోట్లతో సెంటర్ ఫర్ డ్రగ్ రీసెర్చ్, సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ సెంటర్, సెంటర్ ఫర్ నానో డ్రగ్ డెలివర్సీ సిస్టమ్స్, సెంటర్ ఫర్ మాలిక్యూల్స్ అండ్ మెటీరియల్ ఫిజిక్స్, తదితర పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.మిగతా రూ.12 కోట్లను యూనివర్సిటీ టీచర్ల వ్యక్తిగత పరిశోధనకు కోసం ఖర్చు చేయాలి. కె?హబ్ వినియోగంలోకి వస్తే అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), సైబర్ సెక్యూరిటీ, ఫార్మా స్యూటికల్ సైన్స్, రోబోటిక్స్, జియోలాజికల్ సైన్స్, తదితర రంగాల్లో పరిశోధనలు జరిగే అవకాశం ఉంది. యూనివర్సిటీతో పాటు ఇతరుల పరిశోధనలకు కూడా ఇదే ఇంక్యుబేషన్ సెంటర్ కూడా ఉపయోగపడుతుంది.కె?హబ్, పరిశోధనల కోసం ఫండ్స్ రిలీజ్ అయినా.. యూనివర్సిటీ అధికారులు మాత్రం దానిని పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. యూజీసీ ఆఫీసర్లు, కేయూ అధికారుల సమన్వయంతో కంబైన్డ్ మీటింగ్ నిర్వహించి, కె?హబ్ ను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ఇక్కడి అధికారులు చొరవ తీసుకోవాల్సి ఉంది. కాకతీయ యూనివర్సిటీ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే కె?హబ్ తెరచుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, యూనివర్సిటీ అధికారులు తగిన చర్యలు చేపట్టి.. కాకతీయ యూనివర్సిటీలో పరిశోధనల కోసం ఏర్పాటు చేసిన కె?హబ్ ను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చొరవ చూపాలని.. విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# టచ్ చేస్తే... సౌండ్....

కరీంనగర్: చోరీలకు చెక్ పెట్టేలా రామగుండం కమిషనరేట్ పోలీసులు సెన్సార్ సైరన్ లాక్ అందుబాటులోకి తెచ్చారు. ఇళ్లకు తాళాలు వేసి బయటికి వెళ్లేవారు చోరీ జరగకుండా ఉండేందుకు సెన్సార్ సైరన్ లాక్ ఏర్పాటు చేస్తే చోరీలకు చెక్ పెట్టవచ్చని రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు.చోరీలకు చెక్ పెట్టేలా రామగుండం కమిషనరేట్ పోలీసులు సరికొత్త లాక్ కు తెరపైకి తెచ్చారు. సెన్సార్ సైరన్ లాక్ ను మార్కెట్లోకి ప్రవేశపెట్టారు. ఇళ్లకు తాళాలు వేసి బయటికి వెళ్లేవారు చోరీ జరగకుండా ఉండేందుకు సెన్సార్ సైరన్ లాక్ ఏర్పాటు చేస్తే చోరీలకు చెక్ పెట్టవచ్చని రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల కాలంలో ఇళ్లలో షాప్ లలో చోరీలు పెరుగుతున్నాయి. ప్రజలకు కంటి మీద కొనుకు లేకుండా చేస్తూ, పోలీసులకు దొంగలు సవాల్ గా మారారు. ఇలాంటి పరిస్థితుల్లో చోరీలను అదుపుచేసేందుకు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సెన్సార్ సైరన్ లాక్ ను మార్కెట్లోకి తీసుకువచ్చారు.చిన్న చిన్న వస్తువుల నుంచి పెద్ద వాటి వరకు ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ డివైస్ పైనే ఆధారపడి ఉంటున్నాయి. అనునిత్యం జీవన విధానంలో టెక్నాలజీ ఒక భాగంగా ఉంటుంది. సెన్సార్ సైరన్ మీ ఇంటిలోనికి ఎవరైనా చొరబడటానికి ప్రయత్నించినట్లయితే వారి ప్రయత్నాన్ని ఆపేందుకు సెన్సార్ సైరన్ మ్రోగుతుంది. అలారం శబ్దం రావడంతో చుట్టూ పక్కల వారిని కూడా అలర్ట్ చేస్తుంది. తద్వారా దొంగతనం చేయడానికి వచ్చిన వ్యక్తి భయపడి తన ప్రయత్నం విరమించుకుంటాడు. నేరాల నియంత్రణలో సాంకేతికత అవసరాన్ని ప్రజలు గుర్తించి వినియోగించుకోవాలని సీపీ కోరారు. ఇంటికి తాళాలు వేసి బయటకు, ఊర్లకు వెళ్లే వారంతా వివిధ రకాలపరికరాల సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. తద్వారా చోరీలకు పాల్పడే నిందితుల ప్రయత్నాన్ని విరామించుకొనేలా ఆకస్మికంగా వాటి నుంచి వచ్చే అలారం శబ్దంతో భయం కలిగేలా చేస్తుంది.డోర్ అలారాలు చాలా ప్రభావవంతమైన గృహ భద్రతా పరికరాలు, ఎవరైనా మీ ఇంటి తలుపులు తెరిస్తే లేదా తెరవడానికి ప్రయత్నించినప్పుడు అలారం సౌండ్ తో హెచ్చరిస్తాయి. మీరు మీ ఇంటిలోని అన్ని డోర్‌లకు (గ్యారేజ్ డోర్స్, సైడ్ బ్యాక్ డోర్స్, గ్లాస్ గార్డెన్ డోర్స్, సెల్లార్ డోర్స్, సేఫ్ డోర్స్, కార్యాలయాలు, గిడ్డంగులు, కర్మాగారాలు వంటి పారిశ్రామిక ప్రాంతాలు, నివాస గృహాలు, గ్యారేజీలు, దుకాణాలు, రెస్టారెంట్లు, హోటళ్లతో సహా వాణిజ్య ప్రాంగణాలు, ఏదైనా నిల్వ ఉంచే సౌకర్యాలు ఉన్న ప్రాంతంలో మొదలైనవి) డోర్, విండో అలారాలను అటాచ్ చేసుకోవచ్చు. అదేవిధంగా మీ ఇంటి చుట్టూ ఉన్న గ్రౌండ్ ఫ్లోర్ కిటికీలపై విండో అలారాలు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. ఈ అలారం సెక్యూరిటీ గ్యాడ్జెట్ అలారం సిస్టమ్, బజర్, బ్యాటరి లు లభిస్తాయి. దీనిని ఎలా ఉపయోగించాలి అనేది సొంతంగా యూట్యూబ్‌లో వీడియోలు చూసి తెలుసుకోవచ్చన్నారు. దీని బజర్ ఏకంగా 105 నుంచి 110 వరకు డీబీతో మోగుతుంది. చాలా దూరం వరకు ఈ సౌండ్ స్పష్టంగా వినిపిస్తుంది. దీంతో ఎవరైనా లాక్ ,డోర్,విండో తెరిచే ప్రయత్నం చేస్తే వెంటనే అక్కడి నుంచి పారిపోయే పరిస్థితి ఉంటుంది.అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి తదితర ఈ కామర్స్ సైట్స్‌లో ఈ యాంటీ థెఫ్ట్ అలారాలు అందుబాటులో ఉన్నాయి. ధర విషయానికొస్తే కంపెనీ బట్టి రూ. 300 నుంచి రూ. 500లో ఈ గ్యాడ్జెట్స్ అందుబాటులో ఉన్నాయి. సెన్సార్ సైరన్ లాక్ ఏ విధంగా పనిచేస్తుందో మీడియా సమావేశంలో సీపీ వివరించారు.

# కేటీఆర్ ను సన్నిహితులే..బుక్ చేశారా

హైదరాబాద్: తెలంగాణలో సంచలనంగా మారిన పార్ములా ఈ రేస్ కేసులో తప్పు జరిగిన మాట వాస్తవం. ఎలాంటి అనుమతి లేకుండా భారత కరెన్సీని పౌండ్లలోకి మార్చి విదేశీ సంస్థకు కేటాయించింది వాస్తవం. ఈ విషయమై రిజర్వు బ్యాంకు తెలంగాణ ప్రభుత్వానికి రూ.8 కోట్ల జరిమానా విధించింది వాస్తవం. కానీ, మాజీ మంత్రివర్యులు కేటీఆర్ మాత్రం ఈ విషయంలో ఏమీ జరగలేదని వాదించడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. తాను ఏ తప్పు చేయలేదని, అధికారులే చేశారని మొన్నటి వరకు చెప్పి కేటీఆర్ ఏసీబీ, ఈడీ విచారణ సమయంలో ఎస్ నెక్స్??టజెన్ కంపెనీ డైరెక్టర్లను ఇరికించారని తెలుస్తోంది. దీంతో ఇప్పుడు ఆ సంస్థ డైరెక్టర్లు ఏసీబీ ఎదుట హాజరవుతున్నారు. అందులో చలమలశెట్టి అనిల్ ఒకరు. ఈయన సామాన్యుడు కాదు. గ్రీన్‌కో కంపెనీ ఓనర్. కొన్నివేల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన వ్యక్తి. ఫార్ములా ఈ రేసు స్పాన్సర్‌షిప్ కోసం ఓ కంపెనీని 2022 ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాడు. తర్వాత నష్టాలు వచ్చాయని కంపెనీని మూసివేశాడు. ఇదంతా ఓ గూడు పుఠాణి అని క్లియర్‌గా తెలియడంతో ఏసీబీ పట్టు బిగిస్తోంది. కంపెనీ డైరెక్టర్లనే విచారణకు పిలుస్తున్నారు.ఎస్ నెక్స్ జెన్ ఏర్పాటు ఉద్దేశం వందల కోట్లతో ఫార్ములా ఈ రేస్‌ను స్పాన్సర్‌షిప్ చేయడం. ఇది ఎలా సాధ్యమైందని ఏసీబీ ఇప్పుడు ఆరా తీస్తోంది. అయితే ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాల కోసమే తాము స్పాన్సర్‌షిప్ చేశామని డైరెక్టర్లు ఏసీబీకి చెప్పినట్లు తెలుస్తోంది. నష్టాలు వచ్చాయని స్పాన్సర్‌షిప్ ఉపసంహరించుకున్న తర్వాత కూడా రూ.41 కోట్లు ఎందుకు బీఆర్ఎస్‌కు ఎలక్ట్రోలర్ బాండ్ రూపంలో ఇచ్చారని ఆరా తీయగా చెలమలశెట్టి అనిల్‌కీలక విషయాలు వెల్లడించినట్లు సమాచారంగత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అయినా.. ముఖ్యమైన మంత్రి కేటీఆరే అయ్యారు. దీంతో ఆయనతో పారిశ్రామిక వేత్తలు సన్నిహిత సంబంధాలు కోరుకున్నారు. పరిచయాలు పెంచుకున్నారు. ఇలాగే చలమలశెట్టి అనిల్ కూడా కేటీఆర్‌దగ్గరయ్యారు.

ఆయన వేల కోట్ల వ్యాపారం చేస్తున్నారు. అందుకే ప్రభుత్వ మద్దతు అతనికి అవసరం. వ్యాపరరంగంలో మరింత బలపడేందుకు ఆయన ప్రభుత్వానికి కూడా సహకారం అందించారు. ఈ క్రమంలోనే ఫార్ములా ఈ రేస్ స్పాన్సర్‌షిప్ కోసం ముందుకు వచ్చారు. అయితే కేటీఆర్ కారణంగా చివరకు జైలుకు వెళ్లే పరిస్థితి కూడా రావచ్చన్న ప్రచారం జరుగుతోంది.

# కార్యదర్శి కోసం ముగ్గురు కామేడ్స్ పోటీ

నల్గొండ: రాష్ట్ర పార్టీ కార్యదర్శి కోసం..సీపీఎం పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. వరుసగా మూడు టర్మ్‌లుగా రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు తమ్మినేని వీరభద్రం. పార్టీ నిబంధనల ప్రకారం ఆయనకు మరోసారి కార్యదర్శి అయ్యే అవకాశం లేదు. దీంతో పార్టీలో చాలామంది నేతలు రాష్ట్ర కార్యదర్శి సీటుపై కన్నేశారు. దీంతో ఈసారి సీపీఎం పార్టీ రథసారధి ఎవరనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఎప్పుడూ లేని విధంగా జిల్లా కార్యదర్శుల ఎన్నిక కూడా రసవత్తరంగా సాగింది. దీంతో సీపీఎం స్టేట్ సెక్రటరీ రేసు మరింత ఉత్కంఠ రేపుతోంది.త్వరలో సీపీఎం తెలంగాణ రాష్ట్ర మహాసభలు సంగారెడ్డిలో జరగనున్నాయి. రాష్ట్ర మహాసభల చివరిరోజు రాష్ట్ర కొత్త సారధిని ఎన్నుకుంటారు. ప్రతి మూడేళ్లకోసారి సీపీఎం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తారు. ఆ సభల ద్వారానే రాష్ట్ర కార్యదర్శిని పార్టీ ప్రతినిధులు ఎన్నుకుంటారు. ఒక వ్యక్తి పార్టీ కార్యదర్శి పదవికి మూడు టర్మ్‌ల కంటే ఎక్కువ కాలం ఉండకూడదనే రూల్ సీపీఎం పార్టీ ఉంది.గ్రామ కార్యదర్శి నుంచి జాతీయ కార్యదర్శి వరకు మూడుసార్లు మాత్రమే కార్యదర్శి పదవిలో ఉండాలి. ప్రస్తుతం తెలంగాణ సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా తమ్మినేని వీరభద్రం ఉన్నారు. పార్టీ నియమం ప్రకారం తమ్మినేని టర్మ్ ముగియడంతో రాష్ట్ర కార్యదర్శి ఎవరు అవుతారనే ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అనారోగ్యానికి గురి అయ్యారు. అప్పటి నుంచి ఇంచార్జ్ రాష్ట్ర కార్యదర్శిగా ఎస్.వీరయ్య పార్టీ కార్యాలయ బాధ్యతలు చూస్తున్నారు. కొత్త కార్యదర్శి రేసులో పార్టీ సీనియర్ నేతలు ఎస్.వీరయ్య, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఖమ్మం జిల్లాకు చెందిన పోతినేని సుదర్శన్ పోటీ పడుతున్నారు. ఈసారి రాష్ట్ర కార్యదర్శి పదవి పై ఖమ్మం, నల్గొండ జిల్లా నాయకులు ఆశలు పెట్టుకున్నారు.ముఖ్యంగా నల్గొండ జిల్లా నేతలు ఈసారి తమకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తులు చేస్తున్నారట. పార్టీ నిర్మాణంలో తమ జిల్లా పాత్ర ఉందని పార్టీ పదవుల్లో తమకు అన్యాయం జరుగుతోందని, ఈసారి చాన్స్ ఇవ్వాలని పట్టుబడుతున్నారట. అయితే ఈ సారి జిల్లా కార్యదర్శుల ఎన్నిక రసవత్తరంగా సాగింది చాలా జిల్లాల్లో జిల్లా కార్యదర్శి ఎన్నిక కోసం ఓటింగ్ వరకు వెళ్లింది. మరి రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక కూడా ఏకగ్రీవ అవుతుందా.? లేక ఇద్దరు ముగ్గురు నేతలు పోటీ ఉంటే ఓటింగ్ జరుగుతందా అనేది ఆసక్తికరంగా మారింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పదవి ఎవరికి దక్కబోతుందనేది చూడాలి మరి.

# ప్రతి విద్యార్థికి రూ.25 మెనూ చార్జీలు చెల్లించాలి

**- మధ్యాహ్న భోజనం వర్కర్లకు 10 వేలు వేతనం ఇవ్వాలి**

**- ఏఐటీయుసీ జిల్లా ఉపాధ్యక్షులు వెన్న మహేష్**

**- మధ్యాహ్న భోజనం వర్కర్ల ఎంఈవో కు వినతి**

జగిత్యాల: మార్కెట్ ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి 25 రూపాయలు మెన్ చార్జీలు చెల్లించాలని, ఇప్పుడు చెల్లిస్తున్న రేట్లతో వంట చేయలేమని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వెన్న మహేష్ పేర్కొన్నారు.ఏఐటీయుసీ అనుబంధ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన వర్కర్లతో కలిసి మహేష్ జగిత్యాల మండల విద్యాధికారికి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ మార్కెట్లో కోడిగుడ్డు ధర 8 రూపాయలుంటే ప్రభుత్వం 5 రూపాయలు చెల్లిస్తుందని ఒక్క కోడిగుడ్డుకు 3 రూపాయలు నష్టంతో మధ్యాహ్న భోజనం వర్కర్లు విద్యార్థులకు అందించలేరని, ప్రభుత్వమే కోడిగుడ్లను సరఫరా చేయాలన్నారు.మార్కెట్ ధరలకనుగుణంగా మెనూ చార్జీలు లేనందున రెండు కూరలతో భోజనం పెట్టలేరని ఆయన పేర్కొన్నారు.వంట కార్మికులను తొలగించకుండా జిఓ జరిచేయడమే కాకుండా వంట కార్మికులకు ప్రభుత్వం ఇస్తామన్నా 10 వేలు వేతనం వెంటనే చెల్లించాలని మహేష్ డిమాండ్ చేశారు.

వంట సందర్భంగా కార్మికులకు జరుగుతున్న ప్రమాదాల కోసం ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలన్నారు.గత 9 నెలలుగా పెండింగులో ఉన్న కోడిగుడ్డు బిల్లులను వంట కార్మికులకు వెంటనే చెల్లించాలని మహేష్ ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం వంట కార్మికులు శారద, బీ.లక్ష్మి, మల్లేశ్వరి,కె. లక్ష్మి,జరిన, లత, రాధ, రజిత,జయశ్రీ, కవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఆప్ కు కాంగ్రెస్ టెన్షన్

న్యూఢిల్లీ: ఢిల్లీలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఆమ్ ఆద్మీ పార్టీని కాంగ్రెస్ ప్రకటించింది. కాంగ్రెస్ వ్యూహం అంతా ఆప్ బలమైన ఫ్రంట్ చుట్టూ కేంద్రీకృతమై ఉంది. ఢిల్లీలో బలమైన అభ్యర్థులను నిలబెట్టడంతో పాటు, కాంగ్రెస్ దళిత, ముస్లిం ఫార్ములాపై ముందుకు సాగుతోంది.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను త్రిముఖ పోటీగా మార్చడానికి కాంగ్రెస్ అన్ని ప్రయత్నాలను చేసింది. ఒక వైపు పార్టీ ఎన్నికల యుద్ధంలో అన్ని పెద్ద లీడర్లను నిలబెట్టింది. పార్టీ పెద్దలు కూడా ప్రచారంలో జోరుగా పాల్గొంటున్నారు. గత కొన్నాళ్లుగా కోల్పోయిన ఓటు బ్యాంకును తిరిగి పొందడానికి కాంగ్రెస్ శతవిధాలా ప్రయత్నిస్తోంది. 2013 కి ముందు కాంగ్రెస్ కు ఉన్న ఓటు బ్యాంకును ఆమ్ ఆద్మీ పార్టీ కైవసం చేసుకుంది కాంగ్రెస్ ఇప్పుడు స్ట్రాంగ్ గా రీఎంట్రీ ఇస్తే.. అది అరవింద్ కేజ్రీవాల్ ఆమ్ ఆద్మీ పార్టీకి హాని కలిగించవచ్చు. ఈ వాదనలతో పాటు రాజకీయ వర్గాల్లో రెండు ప్రశ్నలు ఉన్నాయి. మొదటిది, కాంగ్రెస్ తన కోల్పోయిన మద్దతును తిరిగి పొందగలదా.. రెండవది, ఆప్(ను ఇబ్బందుల్లో పడేయాలంటే కాంగ్రెస్ ఎన్ని ఓట్లను దక్కించుకోవాల్సి ఉంటుందిఢిల్లీలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఆమ్ ఆద్మీ పార్టీని కాంగ్రెస్ ప్రకటించింది. కాంగ్రెస్ వ్యూహం అంతా ఆప్ బలమైన ఫ్రంట్ చుట్టూ కేంద్రీకృతమై ఉంది. ఢిల్లీలో బలమైన అభ్యర్థులను నిలబెట్టడంతో పాటు, కాంగ్రెస్ దళిత, ముస్లిం ఫార్ములాపై ముందుకు సాగుతోంది. ఆప్‌లోని ముగ్గురు అగ్ర నాయకులను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ కూడా ఒక వ్యూహాన్ని రూపొందించింది. ఇది కాకుండా, పార్టీకి చెందిన ముగ్గురు పెద్ద నాయకులు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఎన్నికల ప్రచారంలోకి దూకనున్నారు. న్యూఢిల్లీ స్థానంలో అరవింద్ కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ స్వయంగా ప్రచారం చేస్తారు. రాహుల్ గాంధీ కూడా 3 రోజుల పాటు ఢిల్లీలో పర్యటించనున్నారు. దీని ద్వారా కాంగ్రెస్ దాదాపు 20 సీట్లను గెలుచుకోవాలని చూస్తోంది.ఢిల్లీలో కాంగ్రెస్ కు ఎన్ని ఓట్లు వస్తాయి. అది ఆప్ పనితీరుపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందా అనేది పెద్ద ప్రశ్న. దీన్ని 3 పాయింట్లలో అర్థం చేసుకుందాం?

1. ఢిల్లీలో బిజెపికి వచ్చిన ఓట్లు

ఈ డీలిమిటేషన్‌తోనే 2008 ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 57 లక్షల ఓట్లు పోలయ్యాయి. అందులో భారతీయ జనతా పార్టీకి 22.4 లక్షల ఓట్లు వచ్చాయి. శాతం పరంగా చూస్తే, ఈ ఎన్నికల్లో బిజెపికి 36.34 శాతం ఓట్లు వచ్చాయి. 2013లో ఢిల్లీలో దాదాపు 78 లక్షల ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో బిజెపికి 33.3 శాతం ఓట్లు వచ్చాయి. సంఖ్యాపరంగా చూస్తే, బిజెపికి దాదాపు 26 లక్షల ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికల్లో బీజేపీ 31 స్థానాలు గెలుచుకుంది. ఇది 2008లో 23 కంటే 8 ఎక్కువ. 2015లో బిజెపి(ఃఏఖ) సీట్లు 31 నుండి 3కి తగ్గాయి.. కానీ బిజెపి ఓట్లలో పెద్దగా తగ్గుదల లేదు. 2015లో దాదాపు 85 లక్షల ఓట్లు పోలయ్యాయి. అందులో బిజెపికి 32 శాతం అంటే 29 లక్షల ఓట్లు వచ్చాయి. 2020లో బిజెపి సీట్లు 3 నుండి 8కి పెరిగాయి. ఈ ఎన్నికల్లో దాదాపు 90 లక్షల ఓట్లు పోలయ్యాయి. బిజెపి కూటమికి 37 వేల ఓట్లు వచ్చాయి. గత 4 ఎన్నికల ట్రాక్ రికార్డ్‌ను పరిశీలిస్తే, బిజెపి ఓట్ల సంఖ్యలో పెద్దగా మార్పు రాలేదు. పైగా బీజేపీ ఓట్ల సంఖ్య పెరిగింది.

2. ఆప్, కాంగ్రెస్ పొందిన ఓట్లు

2013లో ఆమ్ ఆద్మీ పార్టీ 28 సీట్లు గెలుచుకుంది. ఈ ఎన్నికల్లో ఆప్ దాదాపు 23 లక్షల ఓట్లను సాధించింది. 8 సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్ కు 19 లక్షల ఓట్లు వచ్చాయి. 2008లో కాంగ్రెస్ కు 24 లక్షల ఓట్లు వచ్చాయి. 2015 ఎన్నికల్లో ఆప్ సీట్లు 28 నుంచి 67కి పెరిగాయి. కాంగ్రెస్ సీట్లు 8 నుండి సున్నాకి తగ్గాయి. ఈ ఎన్నికల్లో ఆప్ కు 48.7 లక్షల ఓట్లు రాగా, కాంగ్రెస్ కు 8.5 లక్షల ఓట్లు వచ్చాయి. 2020లో ఆప్ సీట్లు 67 నుండి 62కి తగ్గాయి. అయితే, కాంగ్రెస్ సున్నా సీట్లు వచ్చినా ఎటువంటి తేడా రాలేదు. 2020లో కాంగ్రెస్‌కు 2 లక్షల ఓట్లు రాగా, ఆప్‌కు 49 లక్షల ఓట్లు వచ్చాయి. గత 3 ఎన్నికల డేటాను మనం పరిశీలిస్తే, కాంగ్రెస్ ఓట్లు సులభంగా ఆప్ వైపు మళ్లాయి.

3. అందరి దృష్టి ఈసారి ఎన్నికల మీదే

ఎన్నికల సంఘం ప్రకారం.. ఈసారి ఢిల్లీలో మొత్తం 1.5 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వారు ఫిబ్రవరి 5న ఎమ్మెల్యేలను, ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి ఓటు వేస్తారు. ఈ ఎన్నికల్లో ఢిల్లీలో దాదాపు కోటి ఓట్లు పోలవుతాయని నిపుణులు భావిస్తున్నారు. ఓట్ల శాతం దాదాపు 70 ఉండవచ్చు.

కాంగ్రెస్ 10 లక్షలకు పైగా ఓట్లను పొందడంలో విజయవంతమైతే, ఎన్నికల్లో ఆప్ కష్టాలు పెరుగుతాయి. 2020లో ఆప్, బిజెపి ఓట్ల మధ్య అంతరం 12 లక్షలు. 2025 ఎన్నికల యుద్ధంలో ఈ అంతరాన్ని తగ్గించడానికి బిజెపి కూడా బలమైన ఫ్రంట్‌ను ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ 2013లో లాగా 19 లక్షల ఓట్లు పొందగలిగితేనే, అది ఆప్ రాజకీయ ఆరోగ్యంపై ఏదైనా ప్రభావం చూపుతుంది, లేకుంటే కాంగ్రెస్ ఢిల్లీలో ఓటు కొట్టే పార్టీగా మిగిలిపోతుంది. శాతం పరంగా చూస్తే, ఇది దాదాపు 10-12 శాతం ఉంటుంది. ప్రస్తుతం ఢిల్లీలో కాంగ్రెస్ కు 4 శాతం ఓట్లు ఉన్నాయి.

# గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

**- అదనపు కలెక్టర్ బిఎస్. లత**

జగిత్యాల: గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ బి.ఎస్. లత అధికారులను ఆదేశించారు. ఐ.డి.ఓ.సి సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై అడిషనల్ కలెక్టర్ లత సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లత మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో వేడుకలు నిర్వహించనున్నందున అందుకనుగుణంగా వేదిక, సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా చేసుకోవాలని అన్నారు. ప్రొటోకాల్ ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చికిత్స అందించేలా వైద్య బృందాన్ని వేడుక స్థలం వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ భీమ్ రావు, జగిత్యాల ఆర్,డి,వో మధు సూదన్, డి,ఆర్,డి,వో రఘు వరణ్,ఏ,వో హన్మంత రావు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్.. ఆల్‌టైమ్ రికార్డ్‌కు

## రెండు వికెట్ల దూరంలో అర్ష్‌దీప్ సింగ్

- రేపటి నుంచి ఇంగ్లండ్‌తో 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్
- బుధవారం నాడు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో ఫస్ట్ టీ20
- ఇప్పటివరకు భారత్ తరపున టీ20ల్లో మొత్తం 95 వికెట్లు తీసిన అర్ష్‌దీప్
- మరో రెండు వికెట్లు తీస్తే.. టీమిండియా తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు
- ప్రస్తుతం 96 వికెట్లు పడగొట్టి టాప్‌లో ఉన్న స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్

ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ రేపు ప్రారంభం కానుంది. మొత్తం 5 మ్యాచ్‌ల సిరీస్‌లో మొదటి మ్యాచ్ బుధవారం నాడు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరగనుంది. అయితే, ఈ మ్యాచ్‌కు ముందు టీమిండియా మీడియం ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ఓ ఆల్‌టైమ్ రికార్డ్‌కు చేరువలో ఉన్నాడు. ఈ లెఫ్టార్మ్ పేసర్ ఇప్పటివరకు భారత్ తరపున టీ20ల్లో మొత్తం 95 వికెట్లు పడగొట్టాడు. కాగా, దేశం తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అవతరించడానికి కేవలం రెండు వికెట్ల దూరంలో ఉన్నాడు. లెగ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ ప్రస్తుతం 79 ఇన్నింగ్స్‌లలో 25.09 సగటు, 18.7 స్ట్రైక్ రేట్‌తో 96 వికెట్లు పడగొట్టి అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా కొనసాగుతున్నాడు. ఇక అర్ష్‌దీప్ ఇప్పటివరకు 60 టీ20లు ఆడి, 18.1 సగటు, 13.05 స్ట్రైక్ రేట్‌తో 95 వికెట్లు తీశాడు. మరో రెండు వికెట్లు సాధిస్తే.. టీమిండియా తరఫున టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అవతరిస్తాడు.అలాగే ఈ సిరీస్‌లో టీ20 ఇంటర్నేషనల్స్‌లో 100 వికెట్ల మైలురాయిని చేరుకునే తొలి భారతీయ బౌలర్‌గా నిలిచే అవకాశం కూడా అర్ష్‌దీప్‌కు ఉంది. అతనితో పాటు హార్దిక్ పాండ్యా కూడా 89 వికెట్లు (97 ఇన్నింగ్స్‌లలో) పడగొట్టి వంద వికెట్ల ఫీట్‌కు దగ్గరలో ఉ న్నాడు. ఓవరాల్‌గా అర్ష్‌దీప్ సింగ్ మరో ఐదు వికెట్లు తీస్తే పొట్టి




ఫార్మాట్‌లో 100 వికెట్లు సాధించిన 20వ బౌలర్‌గా అవతరిస్తాడు. ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో బంతితో క్లిక్ చెలరేగితే పాండ్యా కూడాఈ అరుదైన ఘనత సాధించే అవకాశం ఉంది. అత్యధిక అంతర్జాతీయ టీ20లు ఆడిన జట్లలో టీమిండియా (242) రెండో స్థానంలో ఉన్నప్పటికీ భారత బౌలర్లలో ఎవరూ ఇంతవరకు 100 వికెట్ల మార్క్‌ను పూర్తి చేయకపోవడం గమనార్హం.పాక్ (253) ఇప్పటి వరకు అత్యధిక టీ20లు ఆడిన జట్టుగా మొదటి స్థానంలో ఉంది.

# అండర్-19 ఉమెన్స్ వరల్డ్‌కప్...

## మలేషియాపై భారత్ బంపర్ విక్టరీ


- కౌలాలంపూర్ వేదికగా మలేషియా, భారత్ మ్యాచ్
- 10 వికెట్ల తేడాతో ఆతిథ్య జట్టును చిత్తు చేసిన యువ భారత్
- టీమిండియా బౌలర్ల ధాటికి 31 పరుగులకే కుప్పకూలిన మలేషియా
- 2.5 ఓవర్లలోనే 32 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించిన టీమిండియా
- ఐదు వికెట్లతో రాణించిన వైష్ణవి శర్మ




ఐసీసీ అండర్-19 ఉమెన్స్ టీ20 వరల్డ్‌కప్‌లో భాగంగా కౌలాలంపూర్ వేదికగా మలేషియాతో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు బంపర్ విక్టరీ సాధించింది. యువ భారత్ ఏకంగా 10 వికెట్ల తేడాతో ప్రత్యర్థి జట్టును చిత్తు చేసింది. మలేషియా నిర్దేశించిన 32 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని వికెట్ నష్టపోకుండా టీమిండియా 2.5 ఓవర్లలోనే ఛేదించింది.
ఓపెనర్లు గొంగడి త్రిష (21), కమిలిని (4) పరుగులు చేశారు. తెలుగమ్మాయి త్రిష 12 బంతుల్లో 5 బౌండరీలతో 21 రన్స్ చేయడం విశేషం. అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన మలేషియాను భారత బౌలర్లు బెంబేలెత్తించారు. టీమిండియా బౌలర్ల ధాటికి ఆతిథ్య జట్టు 14.3 ఓవర్లలో 31 పరుగులకే చాపచుట్టేసింది. మలేషియా బ్యాటర్లలో ఒక్కరంటే ఒక్కరు కూడా డబుల్ డిజిట్ స్కోర్ నమోదు చేయలేదు. అందరూ సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఆ జట్టు బ్యాటర్లలో హుస్నా(5), అలియా (5) టాప్ స్కోరర్లుగా నిలిచారు. ఏకంగా నలుగురు డకౌట్ అయ్యారు. ఇక భారత బౌలర్లలో స్పిన్నర్ వైష్ణవి శర్మ హ్యాట్రిక్ వికెట్లు తీయడంతో పాటు మొత్తంగా 5 వికెట్లు పడగొట్టి మలేషియా పతినాన్ని శాసించింది. అలాగే ఆయుశి 3, జోశిత 1 వికెట్ పడగొట్టారు. 5 వికెట్లతో రాణించిన వైష్ణవి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచింది. కాగా, ఈ టోర్నీలో ఇది యువ భారత్‌కు రెండో విజయం. టీమిండియా తన మొదటి మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను మట్టికరిపించిన విషయం తెలిసిందే.

# ఏం గుండెరా అది.. ఒక రోజు ముందే తుది జట్టు ప్రకటన!

ఇంగ్లండ్ హెడ్ కోచ్ బ్రెండన్ మెక్‌కల్లమ్ మరోసారి తన మార్క్ చూపెట్టాడు. భారత పర్యటనలోనే పరిమిత ఓవర్ల కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన మెక్‌కల్లమ్.. ఒక రోజు ముందే తుది జట్టును ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచాడు.
సాధారణంగా టాస్ పడే వరకు తుది జట్లను ప్రకటించరు.
పిచ్ కండిషన్స్.. టాస్ ఫలితాన్ని బట్టి చివరి నిమిషంలో కూడా తుది జట్టును మారుస్తుంటారు. కానీ దూకుడుకు మారు పేరైన బ్రెండన్ మెక్ కల్లమ్ ఒక రోజు ముందే ఇంగ్లండ్ తుది జట్టు ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌ల కోసం ఇంగ్లండ్.. భారత పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే.
ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా కోల్‌కతా వేదికగా బుధవారం తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ బరిలోకి దిగే ఇంగ్లండ్ తుది జట్టును ఒక రోజు ముందే ప్రకటించారు. జోస్ బట్లర్ సారథ్యంలో ఇంగ్లండ్



బరిలోకి దిగనుంది. ఫాస్ట్ బౌలర్ గస్ అట్కిన్సన్ ఏడాది తర్వాత టీ20 మ్యాచ్ ఆడేందుకు సిద్ధమయ్యాడు. అతను చివరగా 2023 డిసెంబర్‌లో వెస్టిండీస్‌తో టీ20 మ్యాచ్ ఆడాడు. ఆదిల్ రషీద్‌ను స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా జట్టులోకి తీసుకున్నారు. యువ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌ను ఇంగ్లండ్ పరిమిత ఓవర్ల వైస్ కెప్టెన్‌గా నియమించారు. జోఫ్రా ఆర్చర్, మార్క్ వుడ్, గస్ అట్కిన్సన్ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. ఆదిల్ రషీద్‌తో పాటు లియామ్ లివింగ్ స్టోన్ స్పిన్ బౌలింగ్ చేయనున్నాడు. ఒక రోజే ఇంగ్లండ్ తుది జట్టును ప్రకటించడంపై నెటిజన్లు బ్రెండన్ మెక్ కల్లమ్‌ను కొనియాడు తున్నారు. 'ఏం గుండెరా అది'అని కామెంట్ చేస్తున్నారు. 2022లో ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన బ్రెండన్ మెక్‌కల్లమ్.. బజ్ బాల్‌తో టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త విప్లవాన్ని తీసుకొ చ్చాడు. ఇంగ్లండ్‌కు సానుకూల ఫలితాలు రాకున్నా.. ఈ తరహా అప్రోచ్‌తో టెస్ట్ క్రికెట్‌కు క్రేజ్ పెరిగింది. గతేడాదే అతని కాంట్రాక్ట్ ముగిసింది. అయితే ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు. అతని కాంట్రాక్ట్‌ను 2027 వరకు పొడిగించింది. అంతేకాకుండా వైట్‌బాల్ ఫార్మాట్ కోచింగ్ బాధ్యతలను కట్టబెట్టింది. దాంతో మెక్‌కల్లమ్ ఇంగ్లండ్‌కు పూర్తి స్థాయి కోచ్‌గా మారాడు. గతేడాది సెప్టెంబర్‌లోనే నియామకమైనా.భారత పర్యటన తోనే పరిమిత ఓవర్ల కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. భారత్‌తో తొలి టీ20కి ఇంగ్లండ్ తుది జట్టు: బెన్ డకెట్, ఫిల్ సాల్ట్(వికెట్ కీపర్), జోస్ బట్లర్(కెప్టెన్), హ్యారీ బ్రూక్, లియామ్ లివింగ్ స్టోన్, జాకబ్ బెథెల్, జేమీ ఓవర్టన్, గస్ అట్కిన్సన్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్, మార్క్ వుడ్.

# పట్టించుకోని బీసీసీఐ!

## స్పందించిన కరుణ్ నాయర్

ఛాంపియన్స్ ట్రోఫీ కోసం రెండు మూడు రోజుల కిందటే భారత జట్టును ప్రకటించింది బీసీసీఐ. అయితే రోహిత్ శర్మ నాయకత్వంలోనే బరిలోకి దిగనున్న టీమ్‌ఇండియా జట్టులోకి దేశవాళీలో అదరగొట్టిన కరుణ్ నాయర్ ను తీసుకోలేదు. దీంతో ఈ సారి కచ్చితంగా భారత జట్టులోకి కమ్ బ్యాక్ ఇస్తాడని ఆశించిన కరుణ్ నాయర్ కు నిరాశ ఎదురైంది. వన్డే ఫార్మాట్‌లో దూకుడుగా ఆడడంతో పాటు ఏకంగా 8 మ్యాచుల్లో 5 సెంచరీలతో 779 పరుగులు చేసిన అతడిని పక్కన పెట్టడంపై మాజీ క్రికెటర్లు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే తనకు అవకాశం కల్పించకపోవడంపై తాజాగా స్పందించాడు కరుణ్ నాయర్. మూడు రోజుల నుంచి మౌనంగా ఉ న్న అతడు ఇప్పుడు ఈ విషయం గురించి మాట్లాడాడు.
“టీమిండియాలోకి పునరాగమనం చేయడం కోసం ఉన్న అవకాశాలు గురించి ఆలోచన మీ మెదడులో ఉండాలి.

# బీసీసీఐ రూల్‌ను తప్పుబట్టిన జోస్ బట్లర్..

## విదేశీ పర్యటనల్లో ఫ్యామిలీ ఉండాలి!

విదేశీ పర్యటనల్లో ఆటగాళ్ల వెంట కుటుంబ సభ్యులను అనుమతించడంపై ఆంక్షలు విధిస్తూ భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) తీసుకొచ్చిన రూల్‌ను ఇంగ్లండ్ కెప్టెన్ జోస్ బట్లర్ తప్పుబట్టాడు. ఆటగాళ్ల వెంట కుటుంబ సభ్యులు ఉండాల్సిందేనని అభిప్రాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంట రావడం వల్ల ఆటగాళ్లపై ఎలాంటి ప్రభావం ఉండదన్నాడు. ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్ కోసం ఇంగ్లండ్ జట్టు.. భారత్ పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా బుధవారం కోల్‌కతా వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో జోస్ బట్లర్ మంగళవారం మీడియాతో మాట్లాడాడు.
ఈ సందర్భంగా బీసీసీఐ రూల్‌ను బట్లర్ ముందు ప్రస్తావించగా.. అతను తప్పుబట్టాడు. 'కుటుంబమే మా తొలి ప్రాధాన్యత. వారు మా వెంట ఉంటేనే ఆటను ఆస్వాదించేందుకు అవకాశం ఉంటుంది. విదేశీ పర్యటనల్లో ఆటగాళ్ల భార్యలు, కుటుంబ సభ్యులు వెంట ఉ oడటం వల్ల ధృడంగా ఉంటారు.
క్రికెట్‌తో పాటు కుటుంబ సభ్యులను సమన్వయం చేసుకునే సత్తా ఇప్పటి ఆటగాళ్లకు ఉంది. విదేశీ పర్యటనల్లో కుటుంబ సభ్యులు వెంట ఉండటం చాలా ముఖ్యం. ఇది ఆటగాళ్లు మెరుగ్గా రాణించేందుకు సహకరిస్తోంది. విదేశీ పర్యటనల వల్ల ఆటగాళ్లు ఇంటికి దూరంగా ఎక్కువ కాలం ఉండాల్సి వస్తోంది. కరోనా




అనంతరం ఆటగాళ్లతో కుటుంబ సభ్యులు రావడం ఎక్కువైంది. 'అని జోస్ బట్లర్ చెప్పుకొచ్చాడు.
టీమిండియా వరుస పరాజయాల నేపథ్యంలో జట్టును గాడిన పెట్టేందుకు బీసీసీఐ 10 కఠిన నిబంధనలను తీసుకొచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో విదేశీ పర్యటనల్లో ఆటగాళ్లతో కుటంబ సభ్యులను అనుమితంచడంపై ఆంక్షలు విధించడం కూడా ఉంది. ఈ రూల్ ప్రకారం 15 రోజులకు మించి విదేశీ పర్యటనల్లో ఆటగాళ్ల వెంట కుటుంబ సభ్యులను అనుమితించరు. అందుబాటులో ఉన్న ఆటగాళ్లంతా దేశవాళీ క్రికెట్ ఆడాలనేది కూడా ఓ నిబంధనగా ఉంది. అయితే ఈ రూల్స్‌పై అధికారిక ప్రకటన రాలేదు. కానీ మీడియాకు లీకయ్యాయి.

# చివరి శ్వాస వరకు టీమిండియాకు ఆడాలనుంది: మహమ్మద్ షమీ

తన తుది శ్వాస వరకు టీమిండియాకు ఆడాలనుందని స్టార్ పేసర్ మహమ్మద్ షమీ అన్నాడు. దేశం తరఫున ఆడాలన్న తపన ఉన్నంత కాలం.. ఎన్నిసార్లు గాయపడ్డా ఆటగాడు పుంజుకుంటాడని తెలిపాడు. చీల మండ, మొకాలి గాయాలతో 14 నెలల పాటు భారత జట్టుకు దూరంగా ఉన్న మహహ్మద్ షమీ రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో జరగనున్న ఐదు టీ20ల సిరీస్‌తో పునరాగమనం చేయనున్నాడు. బుధవారం కోల్‌కతా వేదికగా భారత్ వర్సెస్ ఇంగ్లండ్ మధ్య తొలి టీ20 జరగనుంది. ఈ మ్యాచ్‌తోనే షమీ మళ్లీ టీమిండియా జెర్సీ ధరించనున్నాడు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి కూడా ఎంపికైన షమీకి ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ లిట్మస్ టెస్ట్ లాంటిది.
బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ సోమవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న షమీ.. తన పునరాగమనంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'దేశం తరఫున ఆడాలన్న కసి ఎప్పుడూ పోవద్దు. దేశానికి ఆడాలనే తపన ఉంటే ఏ ఆటగాడై పోరాడుతాడు. ఎన్నిసార్లు గాయపడ్డా.. కోలుకుంటాడు. ఎన్ని మ్యాచ్‌లు ఆడినా నాకు తక్కువే అనిపిస్తోంది. ఎందుకంటే ఒక్కసారి క్రికెట్‌కు దూరమైతే మళ్లీ ఎప్పటికీ నాకు అవకాశం రాకపోవచ్చు. నా చివరి శ్వాస వరకు టీమిండియాకు ఆడాలనుకుంటున్నా.'అని షమీ చెప్పుకొచ్చాడు.
ఇదే కార్యక్రమంలో పాల్గొన్న గంగూలీ షమీ పునరాగమనంపై సంతోషం వ్యక్తం చేశాడు. మహమ్మద్ షమీ రీఎంట్రీతో టీమిండియా



బలం పెరిగిందని, ఛాంపియన్స్ ట్రోఫీలో తిరుగుండదని గుంగూలీ అభిప్రాయపడ్డాడు. 'షమీ రీఎంట్రీ ఇవ్వడం సంతోషించదగ్గ విషయం. ఎందుకంటే అతను జస్‌ప్రీత్ బుమ్రా తర్వాత అతనే అత్యుత్తమ భారత బౌలర్. షమి కాస్త భయాందోళనలో ఉండవచ్చు. ఎందుకంటే సుదీర్ఘ కాలం తర్వాత మోకాలి నుంచి కోలుకొని క్రికెట్ ఆడుతున్నాడు. కానీ, దేశవాళీ క్రికెట్‌లో బెంగాల్ తరఫున ఆడటం అతనికి కలిసొచ్చే అంశం. ఈ అనుభవం అతనికి ఛాంపియన్స్ ట్రోఫీలో ఉపయోగపడనుంది. షమీ ఎంట్రీతో బుమ్రాపై వర్క్‌లోడ్ తగ్గనుంది. బుమ్రా ఒక ఎండ్ నుంచి.. షమీ మరో ఎండ్ నుంచి బౌలింగ్ చేస్తే జట్టుకు కలిసొస్తుంది. పరస్పర సహకారంతోనే ఇద్దరు టెస్ట్ క్రికెట్‌లో సక్సెస్ అయ్యారు.'అని సౌరవ్ గంగూలీ చెప్పుకొచ్చాడు.

# వైస్ కెప్టెన్సీపై రోహిత్‌తో గొడవ..

## హార్దిక్ పాండ్యాతో గంభీర్ సుదీర్ఘ చర్చ!

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాతో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సుదీర్ఘంగా మాట్లాడటం చర్చనీయాంశమైంది. ఇంగ్లండ్‌తో ఐదు టీ20ల సిరీస్ కోసం బీసీసీఐ..
కోల్‌కతా వేదికగా ప్రాక్టీస్ క్యాంప్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆదివారం ప్రారంభమైన ఈ ప్రాక్టీస్ శిభిరంలో టీ20 సిరీస్‌కు ఎంపికైన ఆటగాళ్లంతా పాల్గొన్నారు.
రెండో రోజు అయిన సోమవారం నెట్స్‌కు దూరంగా హార్దిక్ పాండ్యాతో గంభీర్ ప్రత్యేకంగా మాట్లాడాడు. దాదాపు 30 నిమిషాల పాటు ఈ ఇద్దరు చర్చించుకున్నారు. టీమిండియా వైస్ కెప్టెన్సీ హార్దిక్ పాండ్యాకు ఇవ్వాలని గౌతమ్ గంభీర్ పట్టుబట్టాడని, అందుకు కెప్టెన్ రోహిత్ శర్మ, సెలెక్టర్లు అంగీకరించలేదని వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే హార్దిక్- గంభీర్ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.
ఛాంపియన్స్ ట్రోఫీ 2025తో పాటు ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు సెలెక్షన్ కమిటీ గత శనివారం జట్టును ప్రకటించింది. టీమ్ వివరాలు వెల్లడించే ముందు సెలెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించింది. అయితే జట్టు ఎంపికలో గంభీర్ అతి జోక్యాన్ని సెలెక్టర్లు సహించడం లేదని తెలుస్తోంది.
హార్దిక్ పాండ్యాకు వైస్ కెప్టెన్సీ ఇవ్వాలని, సంజూ శాంసన్‌ను కీపర్‌గా తీసుకోవాలని గంభీర్ ప్రతిపాదిస్తే.. అగార్కర్, రోహిత్ మాత్రం గిల్‌కు వైస్ కెప్టెన్సీ ఇచ్చి, కీపర్‌గా పంత్ వైపు మొగ్గు చూపారు. ఈ




విషయంలో హెడ్ కోచ్, చీఫ్ సెలెక్టర్ మధ్య తీవ్ర చర్చ జరిగినట్లు ప్రచారం జరుగుతోంది.
ఈ నేపథ్యంలో ప్రాక్టీస్ శిభిరంలో గంభీర్-హార్దిక్ పాండ్యా దూరంగా నిలబడి సుదీర్ఘంగా మాట్లాడుకోవడం అనేక సందేహాలకు తావిస్తోంది. జట్టులో ఆటగాళ్ల మధ్య సఖ్యత లేదా? కోచ్ పెత్తనాన్ని సీనియర్ ఆటగాళ్లు సహించలేకపోతున్నారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. బుధవారం కోల్‌కతా వేదికగా తొలి టీ20 జరగనుంది. సోమవారం ప్రాక్టీస్ సెషన్‌లో మహమ్మద్ షమీ తీవ్రంగా సాధన చేశాడు. గాయంతో గతేడాదిగా జట్టుకు దూరంగా ఉన్న షమీ.. ఈ సిరీస్‌తోనే అంతర్జాతీయ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇస్తున్నాడు.

# చాహల్ కు ఎసరు పెట్టిన అర్షదీప్ సింగ్!

ఇంగ్లాండ్ తో తొలి టీ20 మ్యాచ్ కు ముందు టీమిండియా యంగ్ ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ను ఓ భారీ రికార్డు ఊరిస్తోంది. అతడు టీ20ల్లో భారీ రికార్డుకు అతి చేరువలోకి వచ్చాడు.
అంతర్జాతీయ టీ20ల్లో మరో రెండు వికెట్లు తీస్తే.. ఈ పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్‌గా నిలుస్తాడు. ఇంగ్లాండ్‌తో జనవరి 22 నుంచి ప్రారంభం కానున్న ఐదు టీ20 మ్యాచుల సిరీస్‌లో అర్ష్‌దీప్ ఈ రికార్డును చేరుకోవడం ఖాయం. కాగా, ఇంగ్లాండ్‌తో టీ20, వన్డే సిరీస్‌కు సెలెక్ట్ అయిన అర్ష్‌దీప్.. ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభం కానున్న ఛాంపియన్స్ ట్రోఫీ స్క్వాడ్ లోనూ స్థానం సంపాదించుకున్నాడు.
మరో ఐదు వికెట్లు తీస్తే టీ20ల్లో అర్ష్‌దీప్ సింగ్‌కు మంచి రికార్డే ఉ ంది. గత ఏడాది జరిగిన టీ20 వరల్డ్ కప్ ను టీమిండియా గెలుచుకోవడంలో అర్ష్‌దీప్ కీలకంగా వ్యవహరించాడు. 8 మ్యాచుల్లో 17 వికెట్లు తీశాడు. అయితే ప్రస్తుతం అంతర్జాతీయ టీ20 ల్లో అత్యధిక వికెట్లు తీసిన జాబితాలో స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ అగ్ర




స్థానంలో ఉన్నాడు. 80 మ్యాచ్‌ల్లో 96 వికెట్లతో టాప్ లో ఉన్నాడు. ఆ తర్వాత అర్ష్‌దీప్ సింగ్ 60 మ్యాచుల్లో 95 వికెట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.కాబట్టి ఇప్పుడు ఇంగ్లాండ్‌తో జరగబోయే సిరీస్‌లో అర్షదీప్ సింగ్ ఐదు వికెట్లు తీయగలిగితే.. టీ20ల్లో 100 వికెట్లు ఖాతాలో వేసుకున్న తొలి భారత బౌలర్‌గానూ రికార్డు సృష్టిస్తాడు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**